జనవాహిని

ప్రచురణ, తెలంగాణ, సంపుటి -08 సంచిక -70 శనివారం 29-12-2023 పేజీలు -4. వెల రూ.2/-

నేడు మరోమారు తెరపైకి వెంకీ మూవీ

8లో

ఆరు గ్యారంటీల అమలు చేయలేక కొత్త డ్రామాలు

హైదరాబాద్ **జనవాహని** కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కౌంటర్ ఇచ్చారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్లు తెలిపారు.

అంచనాలు పెంచి కట్టారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారని.. పవర్ జనరేట్ ప్రాజెక్టులు, సబ్ స్టేషన్‌లు, లిఫ్టులు ఏర్పాటు చేయడం వల్లే అంచనా పెరిగిందని పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద, 19, 20, 21 పిల్లర్లు కుంగడం దురదృష్టకరమని.. ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కూడా కోరుకుంటోందని తెలిపారు.

ఎంపీ ఎన్నికలు..

బీఆర్ఎస్ కీలక సమావేశాలు

హైదరాబాద్: **జనవాహని** అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపాలై ప్రతిపక్షంలోకి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టింది.

అనుకున్న దాని కంటే ముందే ఎంపీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో ఎన్నికలకు ద్వితీయ శ్రేణి నాయకత్వంతో పాటు క్యాడర్‌ను సంసిద్ధం చేసే పనిపై దృష్టిపెట్టింది.

కొత్త సంవత్సరంలో జనవరి 3 వ తేదీ నుంచి ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశాలను పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా నిర్వహించనుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఈ సన్నాహక సమావేశాలు జరగనున్నాయి. ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతలు సమావేశాలకు హాజరవుతారు. ఈ సమావేశాల షెడ్యూల్‌ను పార్టీ శుక్రవారం ప్రకటించింది.

3వ తేదీన ఆదిలాబాద్ 4న కరీంనగర్, 5 చేవెళ్ల, 6 పెద్దపల్లి, 7 నిజామాబాద్, 8 జహీరాబాద్, 9 ఖమ్మం,10 వరంగల్,11 మహబూబాబాద్, 12 భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాలు, సంక్రాంతి అనంతరం 16న నల్గొండ, 17న నాగర్ కర్నూలు, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజ్‌గిరి, 21న సికింద్రాబాద్ నియోజకవర్గాల సమావేశాలు జరుగుతాయి.పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశాల్లో గులాబీ నేతలు చర్చించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడెక్కడ పొరపాట్లు జరిగాయో సమీక్షించుకొని ఆ తప్పులు మళ్లీ జరగకుండా ఎంపీ సీట్లు గెలుచుకునేందుకు అవలంబించాల్సిన కార్యాచరణను నిర్ణయించనున్నారు.

అస్సాంలో కీలక పరిణామం..

ఉల్ఫాతో కేంద్రం శాంతి ఒప్పందం

అస్సాం,జనవాహనిఈశాన్య రాష్ట్రం అస్సాంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన సాయుధ వేర్పాటువాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం కేంద్రంతో చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది.రాష్ట్రంలో శాంతి కోసం యూఎల్ఎఫ్ఏ, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. కేంద్రం హోంమంత్రి అమిత్ షా సమక్షంలో అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ, యూఎల్ఎఫ్ఏ ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.దీంతో ఈశాన్య రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా జరుగుతున్న (తిరుగుబాటు చర్యలకు) హింసాకాండకు ముగింపు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ వలసలు, తెగలకు భూమి హక్కులు, అస్సాం అభివృద్ధి కోసం ఆర్థిక ప్యాకేజీ లాంటి సమస్యలు కొలిక్కి వచ్చే ఛాన్స్ ఉంది.

'కాగా వేర్పాటువాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం' బంగ్లాదేశ్(ఒకప్పటి తూర్పు పాకిస్తాన్) నుంచి వచ్చిన వలసదారులకు వ్యతిరేకంగా, ప్రత్యేక అస్సాం డిమాండ్‌తో 1979లో ఏర్పడింది. తిరుగుబాటు పేరుతో ఆయుధాలను చేతపట్టిన ఆందోళనకారులు అనేక విధ్వంస చర్యలకు పాల్పడ్డారు. దీంతో దీన్ని కేంద్ర ప్రభుత్వం 1990లో నిషేధిత సంస్థగా ప్రకటించింది. అస్సాంలో ఉల్ఫా అత్యంత పురాతన తిరుగుబాటు దళంగా కొనసాగుతుంది.

14 రాష్ట్రాల మీదుగా భారత్ న్యాయ యాత్ర

– 8న ఖరారుకానున్న రూట్ మ్యాప్

వివరాలు 3లో

మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం బాధాకరం

- కాళేశ్వరం కంటే ప్రాణహిత-చేవెళ్ల ఉత్తమం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీరందించేలా డిజైన్
- మేడిగడ్డ కుంగినప్పటి నుంచి కేసీఆర్ స్పందించలేదు
- ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేపడతాం
- నీటిపారుదుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మేడిగడ్డ బ్యారేజ్ ను సందర్శించిన మంత్రులు

హైదరాబాద్,డిసెంబర్ 29 **జనవాహని**

కాళేశ్వరం కంటే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఉత్తమమై నది అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ మేడిగడ్డ బ్యారేజ్ సందర్శనకు తెలంగాణ మంత్రులు వెళ్లారు. ఈ సందర్భంగా నీటిపారుదుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు నీరందించేలా డిజైన్ చేశామని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు , పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోటమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. మేడిగడ్డ కుంగినప్పటి నుంచి కేసీఆర్ స్పందించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం బాధాకరమని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేపడతామని అసెంబ్లీలో ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని 80 వేల కోట్ల నుంచి లక్షా యాభై వేల కోట్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిందని గుర్తుచేశారు

. ప్రతిపక్షంలో ఉన్నా అధికార పక్షంలో ఉన్నా కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ ఒకే విధానంతో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో రూ.38 వేల కోట్ల వ్యయంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి 16.40 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడానికి నిర్ణయించామన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.80 వేల కోట్లు వ్యయంతో 18 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడానికి నిర్ణయించిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంజినీర్ల సలహాలు కేసీఆర్ తీసుకున్నారా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంజినీర్లుగా సలహాలు ఇవ్వాలి.. వినకపోతే సెలవు పెట్టి పోవాలని స్పష్టం చేశారు. కొండపోచమ్మ ప్రాజెక్టు ఎప్పుడూ నిండుగా ఉంటుందన్నారు.

ఫామ్‌హౌస్‌కు తప్ప ఇతర పొలాలకు నీరు పోదన్నారు.ఇంత ఖర్చు చేసినా ఎంత ఆయకట్టుకు నీరు వెళ్తోందని కోమటిరెడ్డి నిలదీశారు. కాళేశ్వరం కోసం ఎంత విద్యుత్ వాడారు? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గత ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేకపోయిందన్నారు. రైతులకు స్పష్టమైన సందేశం పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఎన్ని టీఎంసీల నీరు ఎత్తిపోశారు? అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు.

వేగంగా వ్యాపిస్తున్న కొత్త కోవిడ్ వేరియంట్

కేరళలో జేఎన్1తీవ్ర వ్యాప్తి

న్యూఢిల్లీ,డిసెంబర్ 29**జనవాహని**

మరోమారు కరోనా మహమ్మారి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పుడిప్పుడే వైరస్ భయం నుండి బయటపడిన ప్రపంచం కోలుకుంటుంది..ఈ క్రమంలోనే కోవిడ్ కొత్త రూపంలో కోవిడ్ కోరలు చాస్తుంది. కోవిడ్- 19 వైరస్ ఓమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 విస్తృతంగా వ్యాపిస్తోంది. %జీవీ% 1 అనేది శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తిని సులభంగా అధిగమించి మనుషుల్లోకి ప్రవేశించగల, ఎఫెక్టివ్ వైవిధ్యంగా చెబుతున్నారు నిపుణులు. అంటే ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి అతి తక్కువ సమయంలోనే చేరుతుంది. ఇప్పుడు కేరళలోనూ జేఎన్1 తీవ్ర పరిస్థితి నెలకొంది.

వరుస సెలవులు, వేడుకల సమయం కాబట్టి %జీవీ%1 కోవిడ్ కేసులు పెరిగే అవకాశం ఉందని అందరూ ఆందోళన చెందుతున్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో కోవిడ్ కేసుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కేరళలో పరిస్థితి కాస్త విపరీతంగా ఉందని చెప్పొచ్చు.

ఎగబడి చలాన్లు కడుతున్న వాహనదారులు

రెండు రోజుల్లోనే రూ.8.44 కోట్ల ఆదాయం

హైదరాబాద్,డిసెంబర్ 29

వాహనదారులతో చలాన్లు కట్టించడానికి అధికారులు ఎన్నో తిప్పలు పడుతుంటారు. భయపెట్టినా, బతిమాలినా ట్రాఫిక్ పెండింగ్ చలాన్లు చెల్లించడానికి మొగ్గు చూపరు. అయితే అధికారులు తీసుకున్న ఓ నిర్ణయంతో వాహనదారులు మాత్రం ఎగబడి చలాన్లు కడుతున్నారు. ఎంతలా అంటే.. ఏకంగా సర్వర్ హ్యాంగ్ అయ్యేంతలా. వివరాల్లోకి వెళితే.. తెలంగాణలో ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల చెల్లింపునకు భారీ రెస్పాన్స్ వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 9.61 లక్షల చలాన్లు వాహనదారుల ఇప్పటి వరకు చెల్లించారు. చలాన్ల ద్వారా రెండు రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా రూ.8.44 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం హైదరాబాద్ పరిధిలోనే 3.54 లక్షల చలాన్ల చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. దీంతో ఒక్క హైదరాబాద్ పరిధిలో చలాన్లతో రూ. 2.62 కోట్ల ఆదాయం సమకూరింది. సైబరాబాద్ పరిధిలో 1.82లక్షల చలాన్ల చెల్లింపు జరగగా రూ.1.80 కోట్ల ఆదాయం వచ్చింది. రాచకొండ పరిధిలో 93 వేల చలాన్ల చెల్లింపు జరగగా.. రూ.76.79 లక్షల ఆదాయం వచ్చింది. చెల్లింపుల



తాకిడితో తరచూ సర్వర్ హ్యాంగ్ అవుతోంది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల వసూలు విషయంలో తెలంగాణ పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో తెలంగాణ పోలీసులు భారీ డిస్కౌంట్ ఇచ్చారు. గతంలో ఇచ్చిన దాని కన్నా ఎక్కువ వెసులుబాటు కల్పించారు. మరోవైపు ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీసులు వాహనాల చలానా డిస్కౌంట్ లపై వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాన సెంటర్‌లలో చలాన్లపై ప్రభుత్వం ప్రకటించిన డిస్కౌంట్‌ల గురించి మైక్‌లోచెబుతూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. సెంటర్లలో వాహనదారులను ఆపి వారికి డిస్కౌంట్‌ల గురించి వివరిస్తూ వారితో చలనాలను కట్టిస్తున్నారు ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు. ఇక, ఈనెల 26వ తేదీ నుంచి పెండింగ్ చలాన్లను డిస్కౌంట్‌తో కట్టే అవకాశం కల్పించారు. జనవరి 10వ తేదీ వరకు చలాన్లను ఆన్‌లైన్‌తో పాటుగా మీ సేవ కేంద్రాల్లో కూడా చెల్లించే వెలుసుబాటు ఇచ్చారు. టూ వీలర్స్, త్రీ వీలర్స్ వాహనాలపై 80 శాతం, ఫోర్ వీలర్స్, హెవీ వెహికల్స్‌పై 60 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఆర్టీసీ డ్రైవర్స్, తోపుడు బండ్ల వారికి 90 శాతం రాయితీ ఇచ్చింది.

రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా?

హైదరాబాద్, డిసెంబర్ 29

ఃతెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుభరోసాపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ స్కీం అర్హుల విషయంలో కొత్త నిబంధనలు తెస్తు న్నట్టు సమాచారం. రేషన్ కార్డు ఉంటేనే రైతుభరోసా అందనుందా అనే చర్చ జరుగుతోంది. అలాగే, పెట్టుబడి సాయానికి పరిమితి విధించే దిశగా కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తోందా అనేది కూ డా ప్రశ్న. రైతుభరోసాకు రేషన్ కార్డును లింక్ చేసే దిశగా చర్యలు చేపట్టడమే అందుకు కారణం. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రవ ంలో భాగంగా 'గ్యారెంటీ' దరఖాస్తులకు రేషన్ కార్డు ప్రతిని జత చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. దాని ప్రకారమే దరఖాస్తులో రేషన్ కార్డు నంబర్, రైతుభరోసా కాలమ్ ఉన్నాయి. దీన్ని బట్టే పెట్టుబడిసాయానికి, రేషన్ కార్డుకు లింక్ చేస్తారన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. సాధారణంగా ప్రతిసారి సీజన్‌కు ముందుకు కొత్త రైతులు ఎవరైనా

ఉంటే వారి నుంచి ఆయా ఏఈవోలు దరఖాస్తులు స్వీకరించి వారి పేర్లను రైతుబంధు జాబితాలో చేర్చుతారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాకు కొత్త రైతుల ఎంపికను ప్రత్యేకంగా రేషన్ కార్డుతో సంబంధం ఉన్నటువంటి గ్యారెంటీల దరఖాస్తులో చేర్చింది. ఇది ఏ మేరకు సక్సెస్ అవు తుందో పరిశీలించాక ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని తెలిసింది. ఆహార భద్రత నిబం ధనల ప్రకారం తెల్ల రేషన్‌కార్డు పొందాలంటే తడి భూమి 3.5 ఎకరాల వరకు, మెట్ట భూమి 7.5 ఎకరాల వరకు ఉండాలి. అంటే ప్రస్తుతం తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్నవారికి గరిష్ఠంగా 7.5 ఎకరాల వరకు భూమి ఉంటుంది. దీంతో రైతుభరోసాకు తెల్ల రేషన్‌కార్డును లింక్ చేస్తే 7.5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు మాత్రమే పెట్టుబడి సాయానికి అర్హులు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభు త్వం కూడా రేషన్‌కార్డు నిబంధనలకు కాస్త అటుఇటుగా భూ పరిమితి పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రైతుబంధులో సుమారు 70 లక్షల మంది రైతులు ఉండగా, 1.52 కోట్ల ఎకరాల భూమి ఉంది. ఇందులో 8 నుంచి 54 ఎకరాల వరకు సుమారు 3 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరి వద్ద 26 లక్షల ఎకరాల భూమి ఉన్నది. వీరికి సుమారు రూ.13 కోట్ల వరకు రైతుబంధు అందు తున్నది. అయితే 8 ఎకరాల్లోపు రైతుల్లోనూ రేషన్‌కార్డు లేని రైతులు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు వారు రేషన్‌కార్డు లేకపోతే రైతుభరోసా ఇవ్వరా? అని ఆందోళన చెందుతున్నారు.

ప్పటికే సీఎం, మంత్రుల సంకేతాలు తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ రైతుభరోసాలో భూ పరిమితికి మద్దతుగానే తన వైఖరిని వెల్లడించింది. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆ పార్టీ మంత్రి సీతక్క, సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రైతుభరోసా పరిమితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. పెద్ద పెద్ద భూస్వాములకు, పాడుపడ్డ భూములకు రైతుబంధు ఇస్తున్నారని, దీన్ని కచ్చితంగా సవరిస్తామని స్పష్టం చేశారు. గ్యారెంటీల దరఖాస్తు ఆవిష్కరణ సందర్భంగానూ రైతుభరోసా పరిమితిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించటంతో దీనిపై జోరుగా చర్చ జరుగుతున్నది. అయితే ఈ యాసంగి సీజన్‌కు నిబంధనల్లో మార్పులు చేర్పులకు సమయం లేకపోవటంతో ఈసారికి పాత పద్ధతిలోనే రైతుబంధు పంపిణీ చేస్తోంది.. వానకాలం సీజన్ నాటికి భారీ మార్పులు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా ఎకరానికి రూ.10 వేలు ఇవ్వగా కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇది అమలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఏటా అదనంగా రూ.7,500 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. అంటే ప్రస్తుతం ఏటా రూ.15 వేల కోట్లు అవసరం అవుతుండగా, ఇక నుంచి రూ.22,500 కోట్లు అవసరం కానున్నాయి. అయితే ఇంత ఆర్థిక భారం మోయడం ప్రభుత్వానికి ఇబ్బందికరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..

తెలంగాణలో కరోనా తాజా కేసుల ఎన్ని?

హైదరాబాద్ , డిసెంబర్ 29(?ః కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 తో కేసులు పెరుగు తుండటంతో యావత్తు దేశం అప్రమత్తమైన విషయం తెలిసిందే. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది.. మొన్నటి వరకు కరోనా కేసుల వివరాలతో కూడిన రోజువారీ బులిటిన్‌ను విడుదల చేసిన వైద్యారోగ్యశాఖ రెండు రో జులుగా బులిటిన్‌ను నిలిపివేసింది. రాష్ట్రవ్యాప్తంగా రోజూ 10 నుం చి 12 కేసులు నమోదయ్యా యి. అందులో 90 శాతం కేసులు గ్రేటర్ పరిధిలోవే. అనారోగ్యంతో ఉస్మానియా జనరల్ హాస్పిట ల్‌లో చేరిన ఐదుగురు రోగులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కాగా, వారిలో ఇద్దరు మృతిచెందారు. మరుసటి రోజు బులెటిన్‌ను నిలిపివేశారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో గురువారం ఒక్కరోజే 87 కేసులు నమోదై, రెండు మరణాలు సంభవించాయి. ఇలాంటి సమయంలో రాష్ట్రంలో కొవిడ్ తాజా కేసుల సమాచారం ఇవ్వకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉత్తర భారతాన్ని కమ్మేసిన పొగమంచు

న్యూఢిల్లీ, డిసెంబర్29 దట్టమైన పొగమంచు ఉత్తర భారతాన్ని కప్పివేసింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, పశ్చిమ మధ్యప్రదేశ్‌ను మరో రెండు రోజులపాటు దట్టమైన పొగమంచు కమ్మేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 31 తర్వాత పొగ మంచు క్రమంగా తగ్గుతుందని వెల్లడించింది. దీంతో ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో చలి వాతావరణం కొనసాగుతున్నది. చలిగాలుల ప్రభావం వల్ల వచ్చే జనవరి 4 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. రానున్న ఐదు రోజుల పాటు ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 7 నుంచి 8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

ఖైదీలకు సంతానోత్పత్తి హక్కుందిః ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 29 తమ వంశాన్ని నిలబెట్టుకునే హక్కు ఖైదీలకూ ఉంటుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. హత్య కేసులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న వ్యక్తికి నాలుగు వారాల పాటు పెరోల్ మంజూరు చేసింది. తన భర్త ద్వారా సంతానాన్ని పొందే అవకాశం కల్పిం చాలన్న అతని భార్య అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరిం చింది. భార్య వయసు 38 ఏళ్లు, భర్త వయసు 41 ఏళ్లను ప్రస్తావిస్తూ....శిక్షా కాలం పూర్తయ్యాక ఆ దంపతులకు సంతానాన్ని పొందే వయసు మీరిపోతుందని, వయోభారం వారి ఉమ్మడి ఆకాంక్షకు అవరోధంగా మారుతుందని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ అభిప్రాయపడ్డారు. తన భర్త ద్వారా సంతానా న్ని పొందాలన్న భార్య హక్కును ప్రభుత్వం అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులోని పూ ర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఖైదీకి తన వంశాన్ని నిలుపుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తీర్పులో వివరించారు. దాంపత్య జీవనం కోసం అనుమతివ్వడం లేదని, వంశాన్ని నిలబెట్టుకోవా లన్న భార్య ఆకాంక్షను, హక్కును గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఖైదీ ఇప్పటికే 14 ఏళ్లుగా జైలులో ఉన్న విషయాన్నీ న్యాయమూర్తి ప్రస్తావించారు. పెరోల్ కోసం రూ.20 వేలకు వ్యక్తిగత బాండును సమర్పించడంతో పాటు ఒకరి పూచీకత్తు ఇవ్వాలని షరతు విధించారు.

తెలంగాణ 'ప్రజాభవన్' ఘటనలో కొత్త కోణం

హైదరాబాద్, డిసెంబర్ 29 హైదరాబాద్ బేగంపేట లోని ప్రజాభవన్ వద్ద ఈ నెల 23న జరిగిన ర్యాష్ డ్రైవింగ్ కేసులో.. ప్రధాన నిందితుడు సాహిల్‌ను తప్పించి మరొకరిని నింది తుడిగా చేర్చిన సంగతి తెలిసిందే. అయితే.. ఇందులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడిని ఎలా తప్పించారనే విషయం తాజాగా వెలుగు చూసింది. ప్రమాదం జరిగిన రోజున రాత్రి డ్యూటీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ దుర్గారావు.. ఘటనాస్థలం నుంచి సాహిల్‌ను కారులో పంజాగుట్ట ఠాణాకు తీసుకొ చ్చారు. కానిస్టేబుల్‌కు అప్పగించి, పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బ్రీత్‌ఎనలైజర్ పరీక్ష కోసం పంపారు. ఈక్రమంలో నిందితుడు తప్పించుకొని, అప్పటికే బయటున్న కారులో ఇంటికి వెళ్లాడు. తమ డ్రైవర్‌ను తన స్థానంలో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు పంపాడు. అతడితో ప్రమాద సమయంలో తానే కారు నడిపినట్టు వాంగ్మూలం ఇప్పించేలా పురిగొల్పాడు. విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూశాక కూడా ఉన్నతాధికారులకు ఇన్‌స్పెక్టర్ అసలు విషయం చెప్పకుండా గోప్య త పాటించినట్టు తేలింది. నిందితుడు తప్పించుకొని ముంబయికి, అక్కడి నుంచి దుబాయ్ పారిపో యేందుకు సహకరించినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. దర్యాప్తును పక్కదారి పట్టించడంలో ఇన్‌స్పెక్టర్ కీలకంగా వ్యవహరించినట్టు పంజాగుట్ట ఠాణా సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారాలు సేకరిం చారు. ఉద్దేశపూర్వకంగానే చేసినట్టు గుర్తించాకనే.. ఇన్‌స్పెక్టర్ దుర్గారావును సస్పెండ్ చేసినట్టు స మాచారం. ఈవ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందనే విషయమై ఆరా తీస్తున్నారు.

ఇన్ చార్జ్‌ల మార్పుపై వైఎస్ఆర్‌సీపీ కసరత్తు

జగన్ పిలుపుతో తాడేపల్లికి పలువురు ఎమ్మెల్యేలు

అమరావతి,డిసెంబర్29: వైఎస్ఆర్‌సీపీ ఇన్ చార్జ్‌ల మార్పుపై కసరత్తు కంటిన్యూ అవుతోంది. సీఎం జగన్ పిలుపుతో తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయానికి కొంతమంది ఎమ్మెల్యేలు వచ్చారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ మోపిదేవి వెంకటరమణ, విజయవాడ తూర్పు నియోజకవర్గ నేత దేవినేని అవినాష్‌లకు పిలుపు వచ్చింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల మార్పులపై సీఎం జగన్ వారితో చర్చించారు. నేతల అభిప్రాయాలు తెలుసుకుని ఇంచార్జీలను ఖరారు చేయనున్నారు. మరోవైపు సీఎం కార్యాలయానికి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా రావడం చర్చనీయాంశమైంది. గిద్దలూరు సహా ప్రకాశం జిల్లాలో పలు నియోజకవర్గాల ఇంచార్జీల మార్పుపై సీఎంతో చర్చించనున్నారు బాలినేని. ఏపీలో మార్పులు చేర్పులతో వైసీపీ నేతలకు టెన్షన్ పట్టుకుంది. ఎవరి సీటుకు ఎసరు పడుతుందో తెలియని పరిస్థితితో ఆందోళనలో ఉన్నారు. లోపల అసంతృప్తి ఉన్నా సీఎం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చాలామంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ సీఎం జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా.. ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని స్పష్టం చేశారు.

పెళ్లి ఏడాది కాకముందే నాగశౌర్య వేరు కాపురం..

షాకింగ్ విషయాలు చెప్పిన తల్లి

అబ్బాయిలు పెళ్ళికి ముందు ఎలా ఉన్నా పెళ్లి తరువాత మారతారు అనేది అందరికి తెల్సిన విషయమే. అత్తాకోడళ్ల మధ్య మగాడు ఇరుక్కున్నాడు అంటే అంతే సంగతులు.ఈ కాలం యువత ఎక్కువ అత్తామామలకు దూరంగా ఉండాలనే కోరుకుంటున్నారు. బంధాలు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది అనేది పెద్దవారు కూడా అర్థం చేసుకుంటున్నారు. ఇక తాజాగా హీరో నాగశౌర్య తల్లి ఉషా ముల్పూరి కూడా అదే విషయాన్ని చెప్పుకొచ్చింది. హీరో నాగశౌర్య ఇండస్ట్రీలో ఎంత ఫేమసో.. అతని తల్లి ఉష కూడా అంతే ఫేమస్. నిర్మాతగా ఆమె ఎన్నో మంచి సినిమాలను టాలీవుడ్ కు అందించింది. అంతేకాకుండా ఉషా ముల్పూరి పేరుతో ఒక రెస్టారెంట్ ను ఓపెన్ చేసి.. మంచి ఫుడ్ ను అందిస్తుంది. ఇక నాగశౌర్య గతేడాది పెళ్లి చేసుకుని వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెల్సిందే. కర్ణాటకకు చెందిన ప్రముఖ ఇంటీరియర్ డిజైనర్ అనూష శెట్టిని ఆయన పెళ్లాడారు. బెంగళూరులోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పెళ్లి తరువాత నాగశౌర్య వేరుకాపురం పెట్టాడని చెప్పి ఆమె షాక్ ఇచ్చింది

" అనూష ఎంతో మంచి అమ్మాయి. తను నాకు మూడేళ్ళ క్రితం నుంచే తెలుసు. శౌర్యకు పర్ఫెక్ట్ జోడీ. ఆమెను కోడలిగా కాకుండా కూతురిలా చూసుకుంటాను. తను కూడా మమల్ని మమ్మా, డాడీ అనే పిలుస్తుంది. నా పెద్ద కోడలు అమెరికాలో ఉంది. అక్కడే యాపిల్ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. అనూష ఇంటీరియర్ డిజైనర్. ఇంట్లో అన్ని పనులు చక్కబెట్టుకొని ఆఫీస్ కు వెళ్తుంది. ఎంతో మెచ్యూర్ ఉన్న అమ్మాయి. పెళ్ళైన కొన్నిరోజులకే వాళ్లు వేరు కాపురం పెట్టారు. ఇలా ఉండాలని పెళ్ళికి ముందే చెప్పుకున్నాం. దూరంగా ఉండి అప్పుడప్పుడు కలుసుకుంటేనే బాగుంటుంది. ఇది ఇప్పుడనుకున్నది కాదు.. పిల్లలు పుట్టినప్పుడు, పెరిగినప్పుడే అలా దూరం ఉండాలని అనుకున్నాం.. ఈ జనరేషన్ లో పిల్లలకు ఫ్రీడమ్ కావాలి. మా పిల్లలకు అలాగే ఇచ్చాం. ఇందులో అంతగా ఆలోచించడానికి ఏమి లేదు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.

అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కెసిఆర్

కోరుట్ల,డిసెంబర్29 బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్పూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో మండలానికి చెందిన 14 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మానిఫెస్టోలో పెట్టిన పథకా లన్నింటినీ అమలు చేయాలని కోరారు.

తిరుప్పావైతో భగవంతుడి సేవ !

శ్రీరంగం,డిసెంబర్29 ధనుర్మాసం అంతా సందడిగా సాగుతోంది. .మనం ఏర్పర్చుకున్న కర్మ బంధం అనేది ఒక దీపానికి పట్టిన మసి వలే మన అసలు స్థితిని గుర్తించ వీలులేనట్టుగా అంటి ఉంటుంది. మనకంటూ ఒక ఆనంద స్థితి ఉందని మరచిపోయాం. దాని వల్లే ఎన్నో క్లేశాలు పొందుతూ ఉన్నాం. భగవంతుడు మనల్ని తనంత ఆనంద స్థితికి చేర్చాలని అనుకుంటాడు. మనల్ని ఉద్ధరించడానికై భగవంతుడు ఎన్నోసార్లు అవతరించాడు. మనం ఉన్న ఈ కలియుగానికి భుజం భుజం రాసుకొనేంత చేరువలో ఉన్న ద్వాపర యుగాంతంలో శ్రీకృష్ణుడిగా వచ్చాడు. రామావతారంలో మాదిరిగాకాక తను కేవలం మానవుడిని అనే హద్దు అనేది లేకుండా శ్రీకృష్ణావతారంలోదేవుడిగానే వచ్చాడు . ఎన్నో లీలలు ప్రదర్శించాడు, ఎన్నో ఉపదేశాలు చేసాడు. మనల్ని బాగు చేద్దాం అని కొండంత ఆశతో వచ్చాడు, కానీ మనం మనమే తప్ప మనలో మార్పు అనేది లేదు. ఎండకు ఎండం. వానకు తడవం. గాలికి చెదరం. అట్లాంటి మన ప్రవృత్తికి విసిగి ఉన్న పరమాత్మని మనల్ని ఒక చోటికి చేర్చింది గోదాదేవి. సమస్త వేదాల సారం అని పిలవబడే తిరుప్పావైని భగవంతుణ్ణి చేరే మెట్ల మాదిరిగా అందించింది. ముప్పైపాటల తిరుప్పావైని ధనుర్మాస వ్రతంగా మనకు అందించింది. ఆమె పాడిన పాటల్లో గోపాలుడు ఉన్నాడు. ఆమె పాటలకు శ్రీరంగనాథుడే చలించి గోదాదేవిని తనవద్దకు రప్పించుకొని వివాహమాడాడు. మనకోసం తనను తానే సమర్పించుకుంది గోదాదేవి. ఆమెను స్వీకరించాడు అంటే, ఆమె మాటలని ఒప్పుకున్నట్లే కదా! ఆమె పాడిన పాటల్ని మనం పాడగలిగితే చాలు. తిరుప్పావై తమిళ సంప్రదాయంలో ఓ మహత్తర గ్రంథం. అందులో ఎన్నో భగవత్ విషయాలు దాగివున్నాయి.

14 రాష్ట్రాల మీదుగా భారత్ న్యాయ యాత్ర

– 8న ఖరారుకానున్న రూట్ మ్యాప్

న్యూఢిల్లీ,డిసెంబర్ 29: దేశ ప్రజలను ఏకం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టబోతున్న భారత్ న్యాయ యాత్రకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి. ఇప్పటికే 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల పాటు యాత్ర చేయాలని నిర్ణయించగా.. దీనికి సంబంధించి ఎగ్జాక్ట్ రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ముఖ్యనేతల భేటీకి పిలుపునిచ్చింది. ఈ భేటీలో రూట్‌మ్యాప్ తోపాటు లోగో, పాటకు సంబంధించి కూడా నిర్ణయం తీసుకోనున్నారు. జనవరి 8న రూట్‌మ్యాప్, జనవరి 12న యాత్రకు సంబంధించిన ప్రత్యేక పాటను విడుదల చేస్తామని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు. ఇప్పటికే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర తీసుకొచ్చిన పాజిటివ్ వైబ్స్ ఇంకా కాంగ్రెస్ క్యాడర్‌లో కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. అయితే ఈ సారి దేశంలోని తూర్పు ప్రాంతం నుంచి పశ్చిమ ప్రాంతం వరకు భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి మార్చి 20 వరకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. మణిపూర్ నుంచి ముంబై వరకు మొత్తం 6 వేల 200 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో మహిళలు, యువత, బలహీనవర్గాల ప్రజలను కలిసి మాట్లాడుతారు రాహుల్. మణిపూర్ నుంచి మొదలయ్యే ఈ న్యాయ యాత్ర.. నాగాలాండ్, అసోం, మేఘాలయ, బెంగాల్, బిహార్, ఝార?ండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ మీదుగా సాగి మహారాష్ట్రకు చేరనుంది. ఈసారి మొత్తం 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల మీదుగా ఈ యాత్ర కొనసాగనుంది. అయితే గతంలో మాదిరిగా పూర్తిగా పాదయాత్ర కాకుండా.. ఈ సారి మధ్యమధ్యలో బస్సు యాత్ర కూడా ఉండనుంది.

మహంకాళి దేవస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటిన అనిల్ కుమార్

రంగశాయిపేట డిసెంబర్ 29
వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేట లో శుక్రవారం రోజున స్థానిక మహంకాళి దేవస్థానం ప్రాంగణంలో శేర్ల అనిల్ కుమార్ గురుస్వామి కొబ్బరి మొక్కలు నాటారు. తాను 18సార్లు అయ్యప్ప మాల వేసిన సందర్భంగా శబరి యాత్ర చేయుచున్నందుకు గుర్తింపుగా ఆర్ వై ఎఫ్ ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనిల్ గురు స్వామి మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక ప్రశాంతత గురించి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో ఉండాలన్నారు. దీని ద్వారా ఒత్తిడి లేని జీవనాన్ని కొనసాగించవచ్చు అని అన్నారు. అనగా ప్రతి రోజు దేవాలయాలను సందర్శించినట్లయితే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు తద్వారా ప్రతి ఒక్కరు ఈ విధమైన జీవనాన్ని కొనసాగించినట్లయితే ప్రతి గ్రామం కూడా ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించవచ్చు అన్నారు ఈ ఆధ్యాత్మిక జీవితంలో ప్రతి ఒక్కరూ దేవాలయాల్లో మొక్కలు నాటినట్లయితే ప్రతి గ్రామం కూడా ఆహ్లాదంగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ వై ఎఫ్ ప్రతినిధులు కొట్టె.వినయ్, బక్కి.రంజిత్, రావుల.సురేష్, రావుల.మహేష్, అర్జున్, రాగి. శ్రీకాంత్,ఆరె. కార్తీక్,దువ్వ. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పుల వర్షం

122 క్షిపణులు, 36 డ్రోన్లు ప్రయోగించిన రష్యా సైన్యం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడింది. చాలారోజుల తర్వాత అతిపెద్ద దాడికి పాల్పడింది.గురువారం రాత్రి నుంచి ఉక్రెయిన్‌లోని కీలకమైన లక్ష్యాలపై ఏకంగా 122 క్షిపణులు, 36 డ్రోన్లు ప్రయోగించింది.18 గంటలపాటు జరిగిన ఈ దాడుల్లో 24 మంది సాధారణ పౌరులు మృతి చెందారని, దాదాపు 130 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌పై ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని పేర్కొన్నాయి. రష్యా సైన్యం ప్రయోగించిన బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, షాహెద్ డ్రోన్లను చాలావరకు కూల్చివేశామని ఉక్రెయిన్ సైనికాధికారి ఒకరు పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్-రష్యా నడుమ యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే.

జార్‌ండ్‌లో 50 ఏళ్లకే పెన్షన్

దళితులకు లబ్ధి: సీఎం హేమంత్ సోరెన్

రాంచీ: పెన్షన్ల మంజూరు విషయంలో జార?ండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనులు, దళితులకు పెన్షన్ అర్హత వయసును 60 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు తగ్గించింది.50 ఏళ్ల వయసు రాగానే పెన్షన్ ప్రయోజనాలు అందుకోవచ్చని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శుక్రవారం ప్రకటించారు.రాష్ట్రంలో జేఎంఎం కూటమి ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు, దళితుల్లో మరణాల రేటు అధికంగా ఉందని, 60 ఏళ్లు దాటాక వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు.

నవంబర్‌లో 'మౌలికం' పురోగతి 7.8 %

న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ నవంబర్‌లో 7.8 శాతం పురోగతి సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం క్రూడ్ ఆయిల్, సిమెంట్ రంగాలు మినహా మిగిలిన అన్ని రంగాలు మంచి పనితీరును కనబరిచాయి. బొగ్గు, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, ఎలక్ట్రిసిటీ రంగాలూ ఈ గ్రూప్‌లో భాగంగా ఉన్నాయి. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ ఎనిమిది నెలల కాలంలో ఎనిమిది రంగాల పురోగతి 8.6 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 8.1%. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ గ్రూప్ వాటా దాదాపు 42 శాతం.

అభయహస్తం 6 గ్యారంటీల పథకంను విజయవంతం చేయాలి

అవగాహన కార్యక్రమంలో ఎం ఆర్ ఓ

జవహర్లాల్ నాయక్, సర్పంచి బంటు కిరణ్.

దామరచర్ల న్యూస్ డిసెంబర్ 29 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన అభయ హస్తం గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఎం ఆర్ ఓ జవహర్లాల్ నాయక్, సర్పంచ్ బంటు కిరణ్ పేర్కొన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణంలో స్థానిక ఎం ఆర్ ఓ జవహర్లాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఏఎన్ఎం అంగన్వాడి పంచాయతీ సిబ్బంది ఇతర వాలంటీర్లను ఉద్దేశించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రజా పాలన కార్యక్రమం శనివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ ఆవరణంలో మొత్తం 24 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.కావున ప్రజలు అందరూ సంయవనం పాటిస్తూ అధికారులకు సహకరిస్తూ తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ ఖాదర్, ఆర్ ఐ సతీష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, ఉప సర్పంచ్ కాసాని సోమయ్య,వివిధ భాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు లో ఘనంగా అయ్యప్ప పడిపూజ

- ఉరుసు లోని వీధులలో అంతా అయ్యప్ప నామ స్మరణతో మారు మోగింది

రంగశాయిపేట డిసెంబర్ 29వరంగల్ నగరంలోని 42వ డివిజన్ ఉరుసు లోని అయ్యప్ప సేవ సంఘం ఆధ్వర్యం లో పడిపూజ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానంలో శుక్రవారం రోజున తుమ్మ లక్ష్మణ్ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు 1000 మంది పైగా అయ్యప్ప స్వాములు పూజలో పాల్గొని అయ్యప్ప స్వామి పాటలు పాడుతూ భజన చేశారు.
దీంతో ఉరుసు ప్రాంతం అంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం బాధ్యులు బూర సంతోష్ ఆడెపు రఘు చింత కింది రాజు మైదం సుమన్ కుసుమ రాజ సమ్మయ్య మిట్టపల్లి సృజన్ గడిదాసు రాఘవ వనం మధు వనం కుమారస్వామి ఆంజనేయ సేవాసమితి ప్రతినిధులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

డాక్టర్ పరీదుల చందర్ సిఎల్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నర్మెట మండల్ డిసెంబర్ 29మచ్చుపహడ్ గ్రామానికి చెందిన కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సేల్ కార్యదర్శి పరిదుల యాదయ్య గౌడ్ చిన్న కుమారుడు పరిదుల చందర్ గౌడ్ స్థాపించిన సిఎల్ఆర్ డెంటల్ హాస్పిటల్ లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన జనగామ జిల్లా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్, ఈ సందర్బంగా మాట్లాడుతూ మనకు అందుబాటులో జిల్లా కేంద్రం జనగామ లో హాస్పిటల్ కలదు, ఎంతో కష్టపడి చదువుకొని ఎన్నో మంచి మంచి అవకాశాలు వచ్చిన చందర్ గౌడ్ తో పాటు ఆయన భార్య నిఖిత గౌడ్ కూడా ఎక్కడికి వెళ్లకుండా మన జనగామ ప్రజలకు సేవ చేయాలనీ ఆశయం తో ఇక్కడే హాస్పిటల్ పెట్టుకొని సేవ చేస్తున్నారు కావున జనగామ ప్రజలు దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు అంతే కాకుండా రాబోయే రోజులలో ప్రజలకు మంచి సేవ చేసుకుంటూ ఇలాంటి హాస్పిటల్స్ ఇంకెన్నో జనగామ ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆశిస్తూ మా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి అని చెప్పారు..సీనియర్ నాయకుడు గొల్లపల్లి కుమారస్వామి, యూత్ కాంగ్రేస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ , జిల్లా కార్యదర్శి భుక్య జయరాం నాయక్, గొల్లపల్లి వెంకట్ రత్నం ,గ్రామ కోర్డినేటర్ జడల రమేష్ మరియు తదితరులు ఆవిష్కరణ చేయడం జరిగింది

ఉద్యమకారులను ఆదుకోవాలి

కన్వీనర్ మరుపల్లి రవి

రంగశాయిపేట డిసెంబర్ 29
నేటి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం ద్వారా 250 గజాల ఇంటి స్థలంతోపాటు ప్రతినెల 25000 పెన్షన్ ఇచ్చుటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపాలని వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి కోరినారు కన్వీనర్ శుక్రవారం రోజున ఉర్సు లో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి అధ్యక్షత వహించి మాట్లాడినారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమించిన ఉద్యమకారుల వివరాలను పోలీస్ శాఖ ఆయా పోలీస్ స్టేషన్లో వివరాలను ఉద్యమకారులకు అందించాలని ఆయన కోరినారు నేటి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలనలో ప్రతి ఉద్యమకారులు తమ వద్ద ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని మరుపల్ల రవి కోరినారు ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధముగా ప్రజాపాలన దరఖాస్తులో పెన్షన్ కాలం చేర్చకపోవడం వలన అయోమయంఅ వుతున్న రన్నారు ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధముగా నేటి ప్రభుత్వం అమలుపరుస్తారాని ఆయన ఆశాబావం వ్యక్తం చేసినారు
ఈ కార్యవర్గం సమావేశంలో కో కన్వీనర్ ఎలగం సత్యనారాయణ శేంకేశి లింగమూర్తి దిండిగల సోమేశ్వర్ మెంతుల యాదగిరి కోడూరు నరేష్ మోక్ష సోమ మధుకర్ బొమ్మగాని కుమార్ స్వామి రాజ్ కుమార్ సురేందర్ కన్నబోయిన రేణుక ముసికే ప్రమీల దేవి గొలనుకొండ ఉపేంద్ర పప్పుల మంజుల కొడిపాక రమాదేవి అవునురి లక్ష్మి పల్లకొండ యకాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

6 గ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ

రంగశాయిపేట డిసెంబర్ 29 శుక్రవారం రోజున నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన అభయహస్తం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు దరఖాస్తు స్వీకరించిన కార్యక్రమంలో భాగంగా కాజీపేట వాటర్ ట్యాంక్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ సయ్యద్ రజాలి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన ఆరు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సానిటరీ విభాగం అధికారులు రవీందర్ గోపి మున్సిపల్ బిల్ కలెక్టర్ ఇంచార్జ్ కుమార్ స్వామి ఆర్పీలు మమత సరిత పద్మ ఉమాదేవి శ్రీదేవి శోభారాణి మునిసిపల్ జవాన్ రవి అనిల్ తదితరులు పాల్గొన్నారు

క్రీడా స్ఫూర్తిని నింపిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కేమిడి యాదగిరి

లింగాల గణపురం న్యూస్ డిసెంబర్ 29.
జనగామ జిల్లా లింగాలఘనపురం మండల కేంద్రంలోని బి.ఆర్.ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కేమిడి యాదగిరి గ్రామంలోని యువకులకు బ్యాడ్మింటన్ కిట్టు అందించి వారిలో క్రీడా స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కేమిడి యాదగిరిగారు మాట్లాడుతూ
యువత శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం కోసం క్రీడల వైపు దృష్టి సాధించాలన్నారు. సెల్ ఫోన్ కు అలవాటుపడి చెడిపోవద్దు అని కోరారు.

రామాలయం దేవాలయము నందు అవ్వారు వారి పవిత్ర సీమంతం నకు హాజరైన తాతిరెడ్డి దంపతులు..!

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.
స్థానిక నంద్యాల పట్టణంలోని రామాలయం దేవాలయం నందు జరిగిన ప్రముఖ జువెల్లరీ వ్యాపారి అవ్వారు శ్రీమతి అండ్ గౌరీనాథ్ గారి కోడలు పవిత్ర గౌతమ్స్ సీమంతం ఫంక్షన్ కు హాజరైన సీనియర్ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి ఆయన భార్య కొత్తపల్లె గ్రామ మాజీ సర్పంచ్ తాతిరెడ్డి లక్ష్మి గార్లు హాజరై పవిత్రను ఆశీర్వదించి దీవించారు.

పేదింటి ఆడపడుచు వివాహానికి గొప్ప మనస్సుతో ఆర్థిక సహాయం అందించండి

సిరిసిల్ల:(జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ బి.రాజు)
వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన రాచర్ల రాజేశ్వరి క్రీస్తు శేషులు రాములు దంపతుల కూతురు తేజశ్వనీ (శ్వేత) వివాహానికి దాతలు ఆర్థిక సహాయం అందించాలని నిరుపేద కుటుంబ సభ్యులు కోరుతున్నారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి అనారోగ్యాన భారీనా పడి ఇప్పటివరకు కుటుంబాన్ని ఒంటి చేత్తో వెళ్లదీసింది. అయితే కూతురు వివాహం మరో వారం రోజుల్లో ఉండటంతో పెళ్లి ఖర్చులు భరించలేని స్థితిలో రాజేశ్వరి కుటుంబం వుంది. అయితే ఎవరైనా మనసున్న దాతలు స్పందించి శ్వేత వివాహానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని నిండు మనసుతో కోరుతున్నారు..
సహాయం పంపించే దాతలు
ఫోన్ పే, గూగుల్ పే 9618005952 (రాచర్ల ప్రసాద్)

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

– కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్

(హుస్నాబాద్ జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాలబాబు)
చిగురుమామిడి ప్రజా పాలనలో భాగంగా ప్రజలు కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరు తమ అర్జీలను నమోదు చేసుకొని ప్రభుత్వ పథకాలను సద్వియోగం చేసుకోవాలని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం గ్యారెంటీ పథకాలలో భాగంగా ప్రజా పాలన కార్యక్రమాలు ఆయా గ్రామ పంచాయతీలలో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కరీంనగర్ ఆర్డీవో ఇందుర్తి గంగిరెడ్డి పల్లె గ్రామాలలో పర్యటించి ప్రజా పాలన దరఖాస్తులను పరిశీలించారు.అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కొందరు రేషన్ కార్డు కొరకై దరఖాస్తులు కాగితంపై రాసి అందజేశారు ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి %ఓజూ%టిసి గీకురు రవీందర్ మండల స్పెషల్ ఆఫీసర్ ఇతనియల్ తహసీల్దార్ నరేందర్ ఎంపీడీవో మామిడాల నరసయ్య ,మండల వ్యవసాయ అధికారి రంజిత్ రెడ్డి డిప్యూటి తాసిల్దార్ పార్థ సారధి పంచులు అందే స్వరూప సన్నిల వెంకటేశం అంగన్ వాడి టిచర్లు ,పాలకవర్గ సభ్యులు,సంబందించిన శాఖ అధికారులు,గ్రామస్తులు,పాల్గొన్నారు.

పద్మావతి నగర్ లోని డా.గోగిశెట్టి నరసింహారావు గారి గృహప్రవేశానికి హాజరైన సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి.

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.స్థానిక నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లోని డా.గోగిశెట్టి నరసింహారావు గారి గృహప్రవేశానికి హాజరైన,సీనియర్ న్యాయవాది తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతిరెడ్డి తులసి రెడ్డి. ఆయనతో పాటు భాస్కర్ రెడ్డి,న్యాయవాది డా.జి.బాలస్వామి,ఏ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం గృహప్రవేశానికి హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ ఎండి ఫిరోజ్,ఏవి.ఆర్ ప్రసాద్ తదితరులతో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి.టి.ఆర్ అసోసియేట్ సభ్యులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షులుగా కసెట్టి చంద్రశేఖర్ నియామకం

- బీజేపీ తీర్థం పుచ్చుకున్న అర్యవైశ్య మహిళలు.

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.నంద్యాల పట్టణ బీజేపీ అద్యక్ష్యులుగా కసెట్టి చంద్రశేఖర్ ను నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బీజేపీ కార్యాలయం లో బీజేపీ అసెంబ్లీ కార్యకర్తల సమావేశానికి నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు, కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిదులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల బీజేపీ పట్టణ అధ్యక్షులుగా కసెట్టి చంద్రశేఖర్ ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. దేశంలో బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆర్యవైశ్య మహిళలు పార్టీలో చేరడం సంతోషంగా వుందని బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నూనెపల్లె ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జక్కా రాజేశ్వరి,కాల్వ పద్మావతి, నిచ్చెన మెట్ల సుధా పార్టీతీర్థం పుచ్చుకున్నారు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కర్నూల్,నంద్యాల లో పార్టీ బలోపేతం చేయడానికి బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డు,గ్రామాల్లో త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కసెట్టి కృష్ణమూర్తి,మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్,డాక్టర్ ఇంటి అధి నారాయణ,లక్ష్మి,స్వాతి,గంగాధర్ నియోజక వర్గంలోని ముఖ్య నాయకులు హాజరయ్యారు.

ముగియనున్న మహానంది దేవస్థానం పాలకమండలి పదవి కాలం



మహానంది. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.మహానంది దేవస్థానం పాలకమండలి పదవి కాలం ఫిబ్రవరి రెండవ తేదీ పూర్తికానునట్లు సమాచారం. ప్రస్తుత పాలకమడలి ఏర్పాటు జరిగిన రోజు నుండి నేటి వరకు మీడియా మిత్రులకు మహానంది దేవస్థానం వారు పాలకమండలి ఏర్పాటు నుండి నేటి వరకు పాలకమండలి తీర్మానాలు చేసే సమావేశం నందు ఎప్పుడు కూడా ప్రత్యక్షంగా సమావేశ సమయంలో మీడియాను అనుమతించలేదు. సమావేశ అనంతరం వారు చెప్పిందే రాసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ పాలకమండలి పదవి కాలం 2024 ఫిబ్రవరి మొదటి వారంలో ముగియనుంది. 2024 మార్చి నెలలో జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై పాలకమండలి తీసుకుపోయే నిర్ణయాలపై పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. చివరి సమావేశంలో పాలకమండలి చేసే తీర్మానాలకు అంత ప్రాధాన్యత ఉంటుందా. గతంలో చేసిన తీర్మానాలు అనుమతులు నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయి. వాటి వివరాలు దేవస్థానం వారు బహిర్గత పర్చాల్సిన అవసరం ఉందా లేదా. చివరి సమయంలో రాజకీయ వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పాలకమండలి సమావేశం అవుతే దాని పర్యవసానం ఎలా ఉంటుంది.

ఇప్పటికే పాలకమండలి సభ్యుల్లో ఉన్న వ్యతిరేకత పలు ఆరోపణల కు తావిస్తున్నట్లు విమర్శలు వెలుతున్నాయి. దీనిపై దేవస్థానం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది తేవాల్సి ఉంది. ఈనెల అనగా 30వ తేదీన జరగాల్సిన సమావేశం వాయిదా పడడం పలు వర్గ విభేదాలకు దారితీస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ఘనంగా అయోధ్య రామ మందిర్ అక్షింతల శోభయాత్ర

సిరిసిల్ల :(జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ బి. రాజు)
ఉత్తర ప్రదేశ్ లోని అయోధ్య రామ మందిర్ నుండి పవిత్రమైన అక్షింతలు వేములవాడ రూలర్ మండలం నుండి వివిధ గ్రామల రామభక్తులు కన్నుల పండుగా గాయత్రి మాత గుడి నుండి తెలంగాణ తల్లి విగ్రహం వరకు కోలాటలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో శిశుమందిర్ విద్యార్థి, విద్యార్థులు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు ,పెద్ద సంఖ్యలో మహిళా మణులు వివిధ ధార్మిక సంస్థలు మరియు కండ కర్యవహా కొండం పుల్లారెడ్డి జిల్లా సహా కర్యవహ ఉచ్చిడి పద్మరెడ్డి బీజేపి మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి కరసేవక్ వెంకన్న కిషోర్ గట్టు హనుమాన్ భక్తులు నాయకులు(శ్రీ అయోధ్య రామమందిర్ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు

నూతన గృహప్రవేశానికి చల్మెడ

(సిరిసిల్ల జనవాహిణి రిపోర్టర్ బి రాజు)కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ ఎంపీటీసీ కాసావేణి మమత మహేష్ ల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావుగారు జడ్పీ చైర్ పర్సన్ న్యలకొండ అరుణ రాఘవరెడ్డి కలిసి హాజరయ్యారు. వారి వెంట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, పలు గ్రామాల ఎంపీటీసీలు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు

పల్లె దవాఖాన ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జనవాహిని న్యూస్ :రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో పల్లె దవాఖానను ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ నలకొండ అరుణ తదితరులు పాల్గొన్నారు

అప్పుల పాలయ్యాం... పదవీ కాలం పెంచండి

–కలెక్టర్ కు సర్పంచ్ ల విన్నపం

పెద్దపల్లి:రామగిరిబీ(జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ రమేష్)పదవి కాలం పెంచాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు సర్పంచ్ లు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 02.02.2019 న సర్పంచ్ ల పదవి కాలం ప్రారంభం అయినప్పటి నుండి ఎంపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వలన 10 నెలల పాటు చెక్ పవర్ ఇవ్వనందున కాలం వృధా అయ్యిందనీ పేర్కొన్నారు. కరోనా వలన 2 సంవత్సరాల పాటు కాలం వృధా అయ్యిందని, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి నిధులు (ఎస్.ఎఫ్.సి) 14 నెలలు గా జమ కాలేదని, కేంద్ర ఆర్థిక నిధులు (సి.ఎఫ్.సి) అడపా దడపా జమ అవ్వడం జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.
కావున సర్పంచ్ లకు ఆర్థికం గా బాగా నష్టం జరిగిందని,అప్పుల పాలు అయ్యి ఆర్థికంగా నష్టపోయామన్నారు.. గతంలో 01.04.1994 నుంచి 31.03.1996 వరకు అప్పటి సర్పంచ్ లకు పదవి కాలం 2 సంవత్సరాలు పెంచి పర్సన్ ఇంచార్జీ గా పదవి కల్పించారని తెలిపారు. కావున బిల్లు లు వచ్చేవరకు పదవి కాలం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ లు గంట పద్మ వెంకట రమణ రెడ్డి, పాశం ఓదేలు,బొల్లపల్లి శంకర్ గౌడ్,కొండ వెంకటేష్,బుర్ర పద్మా శంకర్,కొండవేన. ఓదేలు,పల్లె.ప్రతిమ పీవీరావు, నీలం,సరిత,బడికల విజయ శ్రీనివాస్,గాజుల ప్రశాంతి,దేవునూరి రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ భగవత్ సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం.

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.స్థానిక నంద్యాల పట్టణంలోని శ్రీ భగవత్ సేవా సమాజ్ వారి ప్రాంగణంలో వారి ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం భక్త జన సందోహంతో అంగరంగ వైభోగంగా జరిగింది. మొట్ట మొదట చక్ర ఆకారంలో 108 కళశాలకు, మరియు ముఖ్య కలశ స్థాపన గావించి ఆచార్యుల వారు ప్రత్యేక పూజలతో ముఖ్య నదులను ఆవాహం చేసిన పిమ్మట విశేష పూజా విధులు నిర్వర్తించి మొదటగా పూజకు వచ్చిన భక్తులచే ఒక్కొక్క కలశం ఆచార్యుల వారికి అందిస్తే వారు మూలవిరాట్ స్వామి వారికి అభిషేకం చేస్తారు. అభిషేక ప్రియుడు అయిన శ్రీనివాసుని లోక కళ్యాణం కోసం ప్రతి ధనుర్మాస ఉత్సవాల్లో చేసుకుంటామని పాలకవర్గం వారు తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హెల్త్ వర్కర్ కసమ్మ కుటుంబీకులకు 2లక్షల ఎక్గ్రేషియా చెక్కు అందజేత.

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్.స్థానిక నంద్యాల పట్టణంలోని 22 వ వార్డు రైతునగరం నందు ఈ నెల 9వ తేదీన అనారోగ్యం కారణంతో మరణించిన పబ్లిక్ హెల్త్ వర్కర్ కసమ్మకు, అదే రోజు 15వేల రూపాయలు మట్టి ఖర్చులకు కుటుంబీకులకు ఇవ్వడం జరిగింది. మరల డిసెంబర్ 29వ తేదీన కుటుంబీకులకు 2 లక్షల ఎక్స్గేషియా చెక్కును మునిసిపల్ చైర్ పర్సన్ మాబునిసా చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ అసిస్టంట్ కమీషనర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్, వార్డ్ కౌన్సిలర్, మరియు శానిటేషన్ సూపర్వైజర్ పాల్గొనడం జరిగింది.

నంద్యాల పట్టణంలో నియాన్ ఎంటర్ప్రైజెస్ టైల్స్ శానిటరీ షోరూం ప్రారంభం.

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 29. జనవాహిణి న్యూస్. స్థానిక నంద్యాల పట్టణంలోని పోగాకు కంపెనీ సమీపంలో నియాన్ ఎంటర్ప్రైజెస్ టైల్స్ శానిటరీ షోరూంను శుక్రవారం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి,ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి,ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి,ఎమ్మెల్సీ ఇషాక్ భాషా,శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్సీపీ యువనేత శిల్పాకార్తీకెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సంయుక్తంగా ప్రారంభించారు. వ్యాపారం దినదినాభివృద్ధి సాధించాలని మరిన్ని షోరూంలను ప్రారంభించాలని వారు ఆకాంక్షించారు. ఆంధ్రరాష్ట్రంలో మొట్టమొదటి సారిగా నంద్యాల జిల్లా కేంద్రంలో నియాన్ ఎంటర్ప్రైజెస్ టైల్స్ శానిటరీ షోరూంను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. టైల్స్, శానిటరీ ఉత్పత్తులను నంద్యాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, అలాగే నంద్యాలో మొట్టమొదటి షోరూం ఏర్పాటు చేయడం నంద్యాలకు గర్వకారణం అన్నారు. నంద్యాల జిల్లాగా మారిని తర్వాత అనేక వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. షోరూం అభివృద్ధిలోకి రావాలని ఇలాంటి షోరూంలు మరిన్ని ప్రారంభించాలని కోరారు.

యేసు క్రీస్తు ప్రజల అందరివాడు

కామారెడ్డి డిసెంబర్ 29 జనవాహిణి యేసు క్రీస్తు దేవుడు ప్రజల అందరివాడని అందుకోసమే ప్రపంచం మొత్తం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియోజకవర్గ క్రిస్మస్ వేడుకలను మహోన్నత చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత బోధకులు మాట్లాడుతూ ప్రపంచంలో గల మానవులను రక్షించడానికి వారిని వారి పాపములనుండి విడిపించడానికి లోకంలో మానవ రూపిగా ఓ పశువుల పాకలో జన్మించారని పేర్కొన్నారు. రెండు వేల సంవత్సరాల క్రితం యేసుక్రీస్తు ఈలోకంలో జన్మించారని యేసు క్రీస్తు భూలోకంలో ఉన్నన్ని రోజులు ఎన్నో అద్భుత కార్యాలు చేశారని తెలిపారు.యేసుక్రీస్తు ఓ యుగపురుషుడని అందుకే ప్రపంచం ఈరోజు క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం అని చరిత్ర చెబుతోందని పేర్కొన్నారు.అందుకే యేసుక్రీస్తు ప్రభువు అందరివాడని ఉద్బోధించారు.అనంతరం కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, జెడ్పీటీసీ, తహశీల్దార్, క్రైస్తవ మత పెద్దలు కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు.అనంతరం విందు భోజనాలు చేశారు ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజెస్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాప, మాణిక్యం, దాస్ ఎల్లం, జాషువా, సిరిసిల్ల రత్నాకర్, డేవిడ్, జనరల్ సెక్రటరీ హోసన్న, సీమోను యేసప్ప, సట్టపౌల్,పాల్ రాజు, సుందరరావు , యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో 'మౌలికం ' పురోగతి 7.8 %

న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ నవంబర్‌లో 7.8 శాతం పురోగతి సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం క్రూడ్ ఆయిల్, సిమెంట్ రంగాలు మినహా మిగిలిన అన్ని రంగాలు మంచి పనితీరును కనబరిచాయి.

బొగ్గు, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, ఎలక్ట్రిసిటీ రంగాలూ ఈ గ్రూప్‌లో భాగంగా ఉన్నాయి. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ ఎనిమిది నెలల కాలంలో ఎనిమిది రంగాల పురోగతి 8.6 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 8.1%. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ గ్రూప్ వాటా దాదాపు 42 శాతం.

సంక్షేమ పథకాలకు దరఖాస్తులు ప్రతి ఒక్కరు చేసుకోవాలి

మార్లబీడ్ గ్రామంలో ప్రజా పాలన సెంటర్ ను పరిశీలించిన జెడ్పి చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ

ధరూర్ డిసెంబర్ 29 :- గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని మార్లబీడ్ గ్రామంలోని రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ హాజరై ప్రారంభించారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రజా పాలనను కోరుకుని,ప్రభుత్వాని ఎన్నుకున్న ప్రజలందరికి మాట ఇచ్చినట్లు గానే, ప్రమాణ స్వీకారం చేసిన రోజునే అభయహస్తం 6 గ్యారంటీల ఫైలుపై తొలి సంతకం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ కార్యక్రమంలో భాగంగా అయిదు పథకాల కోసం ఒకే దరఖాస్తులను ప్రభుత్వం ఖరారు చేసింది.మహాలక్ష్మి, రైతుభరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల కోసం అందులోనే వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఇంటి యజమాని పేరు, పుట్టిన తేదీ, సామాజిక వర్గం, ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబరు, వృత్తి, చిరునామా, కుటుంబ సభ్యులందరి వివరాల వంటి పది అంశాలను పూరించాలని.

ఆ తర్వాత అభయహస్తం గ్యారంటీ పథకాల్లో దేనికి దరఖాస్తు చేస్తున్నారో వాటికి టిక్ చేయాలని దరఖాస్తులు అధికారులు స్వీకరించాలని సరితమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి నజ్మానిస బేగం, ఎంపిటీసి ఎల్లమ్మ, గాళ్ల సురేష్,జి, రాము,మాజీ ఎంపిటీసి రోషన్న, శివరాజ్, నరసింహ,శ్రీకాంత్ రెడ్డి, బోయ శ్రీను,రాము,కుర్వ శ్రీనివాసులు, జెడ్పి సిఇఓ కాంతమ్మ, స్పెషల్ ఆఫీసర్ రమేష్,ఎంపిడిఓ జబ్బార్ తదితరులు ఉన్నారు

నెహ్రూ కప్ లో కొత్తగూడెం,భద్రాచలం, పాల్వంచ జట్ల గెలుపు

భద్రాచలం డిసెంబర్ 29

భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న 28వ నెహ్రూ కప్ తాళ్లూరి భారతీదేవి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్లో శుక్రవారం జరిగిన మ్యాచ్లో ల్లో న్యూ స్టార్(కొత్తగూడెం), బెస్ట్ క్రికెట్ అకాడమీ (భద్రాచలం),చెజింగ్ లేవన్ పాల్వంచ జట్లు గెలుపొందాయి.

ఉదయం జరిగిన మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్ ఆర్ లెవెన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 87 పరుగులు చేశారు. జట్టులోని సుమంత్ ఆరు ఫోర్ లతో 36 పరుగులు సాధించాడు. 88 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన న్యూ స్టార్స్ జట్టు కేవలం పది ఓవర్ల లో మూడు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసి విజయం సాధించారు. న్యూ స్టార్స్ జట్టు లోని యుగంధర్ 34 బంతుల్లో 5 సిక్స్ లు,3 ఫోర్ ల సాయంతో 50 పరుగులు సాధించాడు. నిశాంత్ 16 పరుగులు చేశాడు.ఈ మ్యాచ్లో 50 యుగంధర్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ప్రముఖ వ్యాపారవేత్త కే.ఎన్.ఆర్ మార్ట్ వ్యవస్థాపకులు నాగరాజు అందించారు. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్లో ఏ.ఎన్. సి లెవెన్ జట్టుపై బెస్ట్ క్రికెట్ అకాడమీ జట్టు గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఏ ఎన్ సి జట్టు 15 ఓవర్లలో 65 పరుగులు చేశారు.బెస్ట్ క్రికెట్ అకాడమీ కేవలం 10.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసి విజయం సాధించింది.

ఈ జట్టులోని అమిగోత్ 38, ఆర్యన్ 11 పరుగులు సాధించారు. ఈ మ్యాచ్ లో మూడు వికెట్లు తీసిన నాగి కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆర్.కె షాపింగ్ మాల్ వ్యవస్థాపకులు దొడ్డిపట్ల కోటేశ్వరరావు, బ్లడ్ డొనేషన్ సభ్యులు జిందా లు అందజేశారు. సాయంత్రం జరిగిన మూడో మ్యాచ్లో ప్రతాప్ లెవెన్ జట్టుపై చేజింగ్ లెవెల్ పాల్వంచ జట్టు గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ప్రతాప్ లెవెన్ జట్టు 15 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేశారు. 77 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చేజింగ్ లెవెల్ పాల్వంచ జట్టు కేవలం 7.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఈ చెట్టులోని ఈశ్వర్ 19 బంతుల్లో 34 పరుగులు, ప్రవీణ్ 14 పరుగులు చేశారు. మేన్ ది మ్యాచ్ గా ఎంపికైన ఈశ్వర్ కునెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమళ్ళ బాలయోగి మెమెంటో ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, ప్రధాన కార్యదర్శి మడిపల్లి నాగార్జున, కన్వీనర్ ఎస్ కే సలీం, ట్రెజరర్ కుంచాల సదానందం, గౌరవ సలహాదారులు ఎస్కే అజీమ్,తిరుమలరావు,సహాయ కార్యదర్శులు బి.చందు,కావూరి గోపి, పాషా తదితరులు పాల్గొన్నారు

ప్రజా పాలనకు విశేష స్పందన

దోమకొండ జడ్పిటిసి తిరుమల గౌడ్

కామారెడ్డి డిసెంబర్ 29 జనవాహిణి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని దోమకొండ జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ తెలిపారు. దోమకొండ మండలం అంబర్పేట గ్రామంలో ఎంపీటీసీ రాజేశ్వర్ సర్పంచ్ సలీం తహసిల్దార్ సంజయ్ రావు తో కలిపి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 28 నుండి జనవరి ఆరో తేదీ వరకు ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరిస్తున్నారని జెడ్పిటిసి తిరుమల గౌడ్ చెప్పారు.ప్రజల నుండి ప్రజా పాలన కార్యక్రమానికి విశిష్ట స్పందన వస్తుందని ప్రజలు తమ విన్నపాలను కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారని తిరుమల గౌడ్ చెప్పారు. ప్రభుత్వం కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలకు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కార్యక్రమం తీసుకుందని తిరుమల గౌడ్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం కొత్త పింఛన్ల కోసం మహిళలకు 2500 ఆసరా పెన్షన్ కోసం ఇల్లస్థలాలు కోసం పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారని ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందని దోమకొండ జడ్పిటిసి అన్నారు. ప్రజల సమస్యలన్నీ గ్రామసభలలో తమ అర్జీల ద్వారా స్వీకరిస్తున్నారని ఈ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ కావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మంత్రుల బృందం విశేష కృషి జరుపుతుందని అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక కార్యక్రమల ద్వారా ప్రజాపాలన నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజల నుండి వస్తున్న విశేష స్పందన సంతోషం కలిగిస్తుందని దోమకొండ జడ్పిటిసి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీ పథకం అమలు కోసం ప్రజాపాలన నుండి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని దోమకొండ జడ్పిటిసి తిరుమల గౌడ్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్ సర్పంచ్ సలీం ఎమ్మార్వో సంజీవరావు ఎంపిడిఓ చిన్నారెడ్డి తదితరులు అధికారం బృందం సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

- మరిన్ని కొత్త బస్సులు వచ్చేస్తున్నాయ్!

-అందుబాటులోకి కొత్త ఎక్స్ ప్రెస్, రాజధాని ఏసీ, లహరి స్లీపర్ కమ్ సీటర్ బస్సులు

- అంబేద్కర్ విగ్రహం వద్ద రేపు ప్రారంభం

(జనవాహిణి బ్యూరో చిట్యాల భానుబాబు)

ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నిరంతరం కృషి చేస్తోంది. రవాణా రంగంలో వస్తోన్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ వినూత్న పద్ధతుల ద్వారా ప్రయాణికులకు చేరువ అవుతోంది. అందులో భాగంగానే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.400 కోట్ల వ్యయంతో అధునాతనమైన 1050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వాటిలో 400 ఎక్స్ ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులున్నాయి. వీటికి తోడు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 బస్సులను వాడకంలోకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తెస్తోంది. ఈ బస్సులన్నీ విడతల వారీగా మార్చి, 2024 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా సంస్థ ప్లాన్ చేసింది. మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్కీమ్ వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా ఈ కొత్త బస్సులను వినియోగించుకోనుంది.అత్యాధునిక హంగులతో కూడిన 80 కొత్త బస్సులు శనివారం నుంచి వాడకంలోకి వస్తున్నాయి. వాటిలో 30 ఎక్స్ ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్ కమ్ సీటర్ (నాన్ ఏసీ) బస్సులున్నాయి. ఈ కొత్త బస్సుల ప్రారంభోత్సవం హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రేపు ఉదయం 10 గంటలకు జరుగనుంది. తెలంగాణ రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు ముఖ్య అతిథిగా హాజరై కొత్త బస్సులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి రవాణా, రహదారి మరియు భవనాల శాఖ కార్యదర్శి శ్రీ శ్రీనివాస రాజు, ఐఏఎస్, రవాణా శాఖ కమిషనర్ శ్రీ జ్యోతి బుద్ధా ప్రకాశ్, ఐఏఎస్ తోపాటు టీఎస్ ఆర్టీసీ ఎండీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు హాజరవుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ను సందర్శించిన రాష్ట్ర మంత్రులు..

(జనవాహిణి బ్యూరో చిట్యాలబాబు)కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన మంచి చెడులను ప్రజలకు వివరించాలని కోరిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ గత ప్రభుత్వ మానస పుత్రిక అయినటువంటి ఈ కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎంత నీటిని రైతాంగానికి అందించారు ఎంత నీటిని ఎత్తిపోశారు ఎంత నీటిని కిందికి వదిలారు ఎంత కరెంట్ బిల్లు వచ్చింది మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై బాంబు దాడి జరిగిందని గత ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జరిగిన విచారణలో ఎలాంటి బాంబు దాడి జరగలేదని, అందుకు అవకాశం లేదని, పోలీసు అధికారులు స్పష్టం చేయడం జరిగింది ఈ మానస పుత్రిక భవిష్యత్తు పరిస్థితి ఏమిటి ఇన్ని లక్షల కోట్లు ఖర్చుపెట్టి ఆసియా ఖండంలోనే ప్రపంచంలోనే ఇంత పెద్ద సిమెంటు నిర్మాణంతో కట్టిన ప్రాజెక్టు లేదని నాటి పత్రికలు చెప్పడం జరిగింది, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులపై ప్రజలకు వాస్తవాలు వివరిస్తూ చెప్పడంతో పాటుగా భవిష్యత్తులో రైతులకు మన ప్రభుత్వం చేపట్టదలుచుకున్న కార్యక్రమాలపై ఒక కార్యచరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ, ఈ ప్రాజెక్టు కింద బ్యాక్ వాటర్ తో ముంపున ఒక గురవుతున్న విషయంలో చాలా పెద్ద సమస్య నెలకొని ఉంది జరుగుతున్న నష్టం పై ఒక చర్య తీసుకోవాలని 2012 మే 5న అశోక్ చవాన్ గారు పవన్ బన్సల్ గారు నాటి కేంద్ర జల శాఖ ప్రభుత్వ ప్రతినిధులు నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు నాటి తేదీలతో ఉన్న ప్రోసి డింగ్స్ ను పరిశీలించి ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుపై జరిగిన మంచి చెడులను వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని పొన్నం ప్రభాకర్ గారు కోరినారు.

సంపాదకీయం

మారుతున్న రాజకీయ స్వరూపం !

ప్రశ్నించే గొంతులను వినిపించుకోకపోతే... ప్రజాస్వామ్య ఉనికే ప్రశ్నార్థకమవుతుందని పాలకవర్గాలు గ్రహించలేక పోతున్నాయి.ఈ యేడది పరిస్థితులు,పాలకుల తీరును గమనిస్తే ఇది స్పష్టంగా గమనించ వచ్చు. కేంద్రంలోని బిజెపి కావచ్చు ...లేదా ఉభయతెలుగు రాష్ట్రాల్లోని పాలకులు కావచ్చు..దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీల పాలకులు కావచ్చు..పాలకులుగా ప్రజల ఆందోళనలు అర్థం చేసుకోలేక పోయారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ మూల్యం చెల్లించుకున్నారు. తనకు తిరుగులేదని, జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతానని చెప్పి విర్రవీగి చతికిలపడ్డారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పట్టించు కోకుండా ..మళ్లీ మాదే అధికారం అని విర్రవీగిన కెసిఆర్ అహంకారంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ యేడాది చివరలో ఇదో అద్భుత చరిత్రగా మిగిలిపోతుంది. గత ఐదేళ్లలో ధరలు దాడి చేశాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. స్థూల దేశీయోత్పత్తి జిడిపి బాగా క్షీణించింది. దేశంలోని కార్పొరేట్లు... వ్యాపారులు, భూస్వాములు, బడా విదేశీ పెట్టుబడిదారులు మరింతగా బలపడ్డారు. అంతిమంగా సామాన్యులు బాగా బలహీనపడ్డారు. వీటిని చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్రంలోని బిజెపి మరోమారు అధికారంకోసం అర్రులు చాస్తోంది. తెలంగాణ లో కనీసం పది పార్లమెంట్ సీట్లపై గురిపెట్టింది. మొన్నటి ఎన్నికల్లో కొంతమెరుగైన పరిస్థితిని గమనించి కావచ్చు... బిజెపిలో ఆశలు పుట్టాయి. అందుకే హైదరాబాద్ వచ్చిన అమిత్ షా ఇదే విషయం ఉద్బోధించి వెళ్లారు. ఆశపడడంలో తప్పులేదు. కానీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామా లేదా అన్న చర్చ చేయడం లేదు. తెలంగాణలో ప్రజాపాలనకు తెరలేచింది. ప్రజలకు గొంతు విప్పే అవకాశం వచ్చింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం...ప్రజల్లో ఓ రకమైన భరోసా దక్కడం..గత పాలకుల పాపాలు బయటపడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం దేశంలో వస్తున్న మార్పులను గమనించడం లేదు. ఎదుటి పార్టీలను



అణచివేయడం...డబ్బులను పప్పుబెల్లాల్లా పందేరం చేయడంతో తన అధికార పీఠాన్ని పదిలం చేసుకోవచ్చన్న ధీమాతో రాజకీయాలు చేస్తున్నారు. ఎపిలో కూడా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. షర్మిలను రంగంలోకి దింపడం ద్వారా పోయిన ప్రతిష్టను పొందాలని చూస్తోంది. ఇది సాధ్యమా కాదా అన్నది ముమ్ముందు తేలనుంది. అయితే పాలకులు మాత్రం ప్రజలు సమస్యలు తమ ఎజెండాలో లేవన్న స్థిరాభిప్రాయంలో ఉన్నారు. ఇకపోతే మోడీని వ్యతిరేకించే శక్తులు ఏకం కావడం మొదలయ్యింది. ఏకపక్ష నిర్ణయాలతో మోడీ ప్రజాభిప్రాయాలను తుంగలో తొక్కుతున్నారు. ఇటీవల మూకుమ్మడిగా పార్లమెంటులో ఎంపిల సస్పెన్షన్ బిజెపి అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు పరాకాష్టగా చూడాలి. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర రాజకీయ ప్రయోజనాలు ఇచ్చిందనడానికి కర్నాటక, తెలంగాణ పరిణామాలు నిదర్శనంగా చూడాలి. ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనా విధానంపై చర్చకు అవకాశం ఇచ్చింది. ఇండియాకూటమిలో ఎన్ని లుకలుకలు ఉన్నా కాంగ్రెస్ కేంద్రంగా విపక్షాలు కలసి వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో ఎక్కడో ఒకచోట ప్రశ్నించే తత్వం రావాలి. కేంద్రంలోని బిజెపిని ఢీకొనేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ శక్తులు సమాయత్తమవుతున్నాయి. అయితే పాలనలో ఉన్న వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయపార్టీలు తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ.. కేవలం మోడీవైపు వేలెత్తి చూపుతున్నాయి. దీనిని కూడా ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. నిజానికి స్థానిక ప్రభుత్వాలపై ప్రజలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.. బిహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని వదిలించుకుని మహాకూటమి సర్కార్ ఏర్పాటు చేసిన నితీశ్ కుమార్ వ్యవహారశైలి కూడా పెద్దగా ఆశాజనకంగా లేదు.

ఢిల్లీలో బిజెపి ఉధృతిని అడ్డుకుని పంజాబ్,ఢిల్లీల్లో పాగా వేసిన అరవింద్ కేజీవ్రాల్ మరోవైపు సవాల్ చేస్తున్నా..ఆయన అనుచరులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. తన ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చి కేసీఆర్ కూడా బిజెపిపై సవాళ్లు విసిరి చతికిల పడ్డారు. రాజకీయంగా చూస్తే, గడచిపోతున్న సంవత్సరం అంతా మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి పెద్ద విజయాలనే అందించింది. తెలంగాణ మినహా మూడు రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లో సాధించిన విజయాలే 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపి తిరిగి జాతీయ స్థాయిలో అధికారం చేజిక్కించుకుంటుందన్న ధీమాలో బిజెపి నేతలు ఉన్నారు. అందుకే బిజెపి తన పూర్తి దృష్టిని ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రీకరించింది. ప్రతిపక్షాలు నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపితో హోరాహోరీగా పోరాడు తున్నాయి. అయినా పెద్దగా విజయం సాధించడం లేదు. 2024 నాటికి కాంగ్రెస్ జాతీయ స్థాయిలో బిజెపితో తలపడేందుకు సన్నద్ధం కాగలుగుతుందని తహతహలాడుతోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ బిజెపి ఎందుకో దేశంలోని సామాన్యులను నేటికీ దరిచేర్చుకోవడం లేదు. ప్రధాన సమస్యలపై స్పందిం చడం లేదు. ఆర్థిక సమస్యలను,ధరల పెరుగుదలను పట్టించుకోవడం లేదు. 2024 ఎన్నికలకు జాతీయ స్థాయిలో బిజెపి వ్యతిరేక పక్షాలు ఏ రూపంలో వస్తాయన్నదానికి స్పష్టత లేదు. సిబిఐ,ఈడీలతో పాటు అనేక వ్యవస్థల్నీ బిజెపి పెద్ద ఎత్తున ఉపయోగిం చుకుని ప్రత్యర్థుల్ని నిర్వీర్యం చేస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఇతర నేతలపైనే 95 శాతం పైగా సిబిఐ కేసులున్నాయి. ఇకపోతే ఏడాది చివరలో మరోమారు కరోనాకొత్త వేరియంట్ భయపెడుతోంది. ఇప్పటికీ దీనిపీడ విరగడ అయ్యిందన్న ధీమా రావడంలేదు. ఈ కారణంగా 2023 సంవత్సం ప్రజలకు ఎలాంటి ఆనందాన్ని ఇవ్వలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వదిలిపెట్టి పాలకులు, పార్టీలో ఎన్నికల్లో గెలవడమెలా...అన్న విషయంలో వ్యూహకర్తలతో మంతనాలు చేస్తున్నారు. ఈ తరహా రాజకీయాలు పోనంతవరకు దేశం బాగుపడదిన గుర్తించాలి.

అమరావతి ఆందోళనలకు కాలం చెల్లు

నాలుగున్నరేళ్లుగా పోరాడినా ఫలితం సున్నా - బిజెపిపై ప్రజల్లో సన్నగిల్లిన ఆశలు

అమరావతి,డిసెంబ్29రాజధాని రైతుల ఆందోళనలను పట్టించుకోకుండా గత ఐదేళ్లుగా జగన్ పాలన సాగింది. మందడం, తుళ్లూరు,వెలగపూడిలో దీక్షలు కొనసాగినా..పట్టించుకోలేదు. అలాగని రాజధాని కూడా రాలేదు. విశాఖకు రాజధాని మార్చాలని అనుకున్నా లీగల్ సమస్యల కారణంగా అదీ ముందుకు సాగలేదు. ఇక మరో రెండుమూడు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటికిప్పుడు రాజధాని అన్నది ఇక సమస్యే కాదు. పెనుమాక, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, రాయపూడి, నేలపాడు, పెదపరిమి, తాడికొండ అద్దరోడ్డు, 14వ మైలులో రైతులు గత నాలుగున్నరేళ్లుగా ధర్నాలు, ఆందోళనలు చేశారు. మిగతా రాజధాని గ్రామాల్లోనూ రైతుల ఆందోళనలు కొనసాగాయి. అమరావతి విషయమై వైసీపీ, తెలుగుదేశం పార్టీల మధ్య పోరాటం సాగింది. జనసేన - బీజేపీ లు కూడా అమరావతికి మద్దతు తెలిపాయి. రాజధానిని తరలించకుండా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ పెద్దలు అడ్డుకుంటారని రాష్ట్ర ప్రజలు గంపెడాశతో ఉన్నా...సాకారం కాలేదు. బిజెపి కూడా కట్టె విరగకుండా, పాము చావకుండా అన్న పద్ధతిలో కాలయాపన చేసింది. రాజధాని మార్పు అనివార్యం అని చ ఎప్పినా..మూడు రాజధానులని మాటమార్చినా ఏదీ సాకారం కాలేదు. రాజధాని ఊసులేకుండానే నాలుగున్నరేల్లుగా జగన్ ప్రభుత్వం తనవని తాను చేసుకుంటూ పోయింది. మూడురాజధానులపై ముక్కుసూటిగా వ్యవహరించినా ఫలించలేదు. అమరావతి అంటే చంద్రబాబు భూకుంభకోణం అన్న రీతిలో వ్యవహారం సాగించారు. ఆంధ్రప్రదేశ్‌లో బలపడాలనుకున్న భారతీయ జనతా పార్టీకి అమరావతి కలిసివచ్చే అంశమే అయినా ..అది రాష్ట్ర వ్యవహారమని తేల్చేసి చేతులెత్తేసింది. దీంతో పోరాడే అవకాశాన్ని కోల్పోయింది. అమరావతి తరలింపును అడ్డుకోగలిగితే బీజేపీకి ప్రజల ఆదరణ దక్కేది. రాజధాని రైతులు మాత్రమే కాదు, ఇతర ప్రాంతాలవారు కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని బీజేపీ పెద్దలు కట్టడి చేయాలని ఆశించినా సాకాం కాలేదు. అయితే బీజేపీ నాయకులు ఈ దిశగా నిర్దుష్ట కార్యాచరణ ప్రకటించకపోవడం పట్ల ప్రజల్లో కూడా ఆ పార్టీపై

నమ్మకాలు సన్నగిల్లాయి. ఇప్పటికే రెండు పర్యాయాలు ఢిల్లీ వెళ్లి వచ్చిన జనసేనాని పవన్ కల్యాణ్ అక్కడ బీజేపీ పెద్దలతో ఏమి మాట్లాడారో తెలియదు. మొత్తంమీద అంది వచ్చిన అవకాశాన్ని బీజేపీ నాయకులు చేజార్చుకుంటున్నారన్న భావన మాత్రం రాష్ట్రంలో విస్తృతంగా వ్యాపించింది. రాజధాని తరలింపు విషయంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయినట్లుగానే కనిపించినా..అదికూడా సాకారం కాలేదు. విశాఖలో కార్యాలయాల తరలింపు ప్రక్రియ కూడా కుదరలేదు. దీంతో జనసేన బీజేపీ చేతులు కలిపినా ఒరిగేది ఏమీ ఉండబోదని తేలింది. రాష్ట్రంలో బీజేపీ బలపడకపోగా ఆ పార్టీతో చేయి కలిపినందుకు జనసేన కూడా ఉన్న బలాన్ని కోల్పోవచ్చు. ఇప్పటికే ఉన్న ఒక్క ఎమ్మెల్యే కూడా జారుకున్నారు. జగన్ విషయంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా మనసులో ఏముందో మాత్రం తెలియడం లేదు. రాజధాని తరలింపునకు ఈ ఇరువురు పెద్దల ఆమోదం ఉందన్నట్టుగా వైసీపీ నాయకులు హడావిడి చేస్తూ వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితులలో జనసేన ,బీజేపీ చేతులు కలిపినంత మాత్రాన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఢీ కొనలేరన్న అభిప్రాయం కూడా ఉంది. అమరావతి తరలింపు అంశాన్ని ఆధారంగా చేసుకుని ప్రజల్లో మళ్లీ బలపడాలని తెలుగుదేశం పావులు కదుపుతోంది. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా దూసుకు పోవాలనుకుంటోంది. ఈ మేరకు ప్రజాచైతన్య యాత్రలతో బాబు సహా టిడిపి నేతలు పోరాడుతున్నారు. అయితే అమరావతి ప్రాంతం తప్ప మరెక్కడా రాజధాని మార్పుపై పెద్దగా ఆందోళనలు కనింపించడం లేదు. జగన్‌కు ఇది కలసి వచ్చే అంశంగా చూడాలి. అమరావతిలో రాజధాని కోసం 33 వేల ఎకరాలతోపాటు గన్నవరం విమానాశ్రయం విస్తరణ కోసం 600 ఎకరాల భూములిచ్చిన రైతులకు ఉన్న పళంగా నష్టపరిహారం చెల్లించే పరిస్థితిలో రాష్ట్రప్రభుత్వం లేదు. దీంతో రాజధాని వ్యవహారంలో పీటముడి పడింది. ఇటు అమరావతిలోనూ, అటు విశాఖలోనూ అభివృద్ధి జరిగే అవకాశం కూడా లేకుండా పోయిందు. జీవచ్ఛవంలా అమరావతి మిగిలిపోతుందని టిడిపి విమర్శలు చేస్తోంది. మొత్తంగా అమరావతి అన్నది ఇక భ్రమ మాత్రమే కాగలదు. ప్రభుత్వం మారితే..తప్ప దీనికి మళ్లీ ప్రాణప్రతిష్ట జరగదు.

ఖమ్మం రాజకీయాల్లో కాంగ్రెస్ హవా

ఎంపి ఎన్నికల్లోనూ అనుకూలంగా పరిస్థితి - అడ్రస్ లేకుండా పోయిన బిఆర్ఎస్

ఖమ్మం,డిసెంబర్29 ఖమ్మం రాజకీయాల్లో ఇప్పుడు అంతా కాంగ్రెస్ హవా అని తేలిపోయింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పావులు కదుపుతోంది. జిల్లాలో గతంలో మాజీమంత్రి పువ్వాడ హవా కొనసాగిం చారు. తనకు తిరుగులేదని ధిక్కరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను పక్కన పెట్టారు. ఇప్పుడు ఇక పువ్వాడకు రాజకీయంగా ఎలాంటి పరపతి లేదనే చెప్పాలి. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు ముగ్గురు మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ బలంగా ఎదిగింది. ఇదంతా పువ్వాడ నిరంకుశ విధానాల కారణంగా జరిగిందన్నది అక్షరసత్యం.పార్లమెంటరీ పార్టీనేత నామా నాగేశ్వర రావు కూడా పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. గత ఎన్నికల్లో అన్నింటా బిఆర్ఎస్ విజయంతో పువ్వాడ బలం పెంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా పువ్వాడ అజయ్‌కుమార్ ఒక్కరే గెలుపొందినప్పటికీ.. ఆ తర్వాత నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వైరా స్వతంత్ర ఎమ్మెల్యే, సత్తుపల్లి టీడీపీ ఎమ్మెల్యే టీఆర్ఎస్ లో చేరడంతో జిల్లాలో బిఆర్ఎస్ బలం ఏడుకు చేరింది. దీంతో ఇక అన్ని ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులు లేరన్న ధోరణిలో పట్టు సాధించారు. అయితే మొన్నటి ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటును కూడా బిఆర్ఎస్ గెలుచుకోలేదు. దీంతో పార్లమెంట ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి అడ్రస్ గల్లంతు కానుంది. దీని ప్రభావం పక్కనున్న మానుకోటపైనా పడనుంది. కాంగ్రెస్ నుంచి మరోమాఉ రేణుకాచౌదరి రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో బీజేపీ ప్రభావం చూపక పోయినప్పటికీ.. బలపడేందుకు ప్రయత్నాలు వేగిరం చేసింది. గతంలో అనేక పర్యాయాలు ప్రయత్నించినా ఆశించిన రీతిలో ఆ పార్టీ బలం పుంజుకోలేక పోయింది. దీంతో వచ్చే ఎన్నికల్లో అయినా సత్తా చాటాలని చూస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ పరోక్షంగా, ప్రత్యక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో బిఆర్ఎస్ పార్టీ మరింత దెబ్బతిన్నది. కమ్యూనిస్టులు పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేపట్టినా.. అనుకున్న విధంగా రాణించలేకపో యాయి. అయితే కొత్తగూడెంలో సిపిఐ నేత కూనంనేని గెలవడంతో పాటు,

సింగరేణి ఎన్నికల్లో సత్తా చాటడంతో ఆశలు చిగురించాయి. భవిష్యత్‌పై ఆశలు పెంచుకుంటూ బలం పెంచుకునే దిశగా సిపిఐ అడుగులు వేస్తోంది. గతంలో పంచాయతీ ఎన్నికల నుంచి మండల, జిల్లాపరిషత్, లోక్‌సభ ఎన్నికల వరకు టీఆర్ఎస్ వరుస విజయాలు సాధించింది. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి ఒకరి తర్వాత ఒకరుగా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. మొత్తంగా కాంగ్రెస్ దీలాపడ్డా తమ సత్తా కూడా చాటుతామని అనుకున్నారు. ఇప్పుడు వీరంతా తెరమరుగు అయ్యారు. వామపక్షాల విషయానికి వస్తే.. సీపీఎం, సీపీఐ, ఎన్డీ ప్రజాపోరాటాల్లో ముందున్నా.. ఎన్నికల్లో వెనుకబడ్డాయి. ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవు తాయని సిపిఐ బలంగా నమ్మి ముందుకు సాగింది. కాంగ్రెస్‌తో పొత్తుకూడా కలసి వచ్చింది. రైతులకు గిట్టుబాటు ధరలు మొదలు అనేక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ పోరాటాలను చేసింది. తమకు అసెంబ్లీలో బలం లేకున్నా ప్రజల్లో మాత్రం విశ్వాసం చెక్కు చెదరలేదనినిరూపించుకుంది. సిపిఎం మాత్రం ఒంటిరి పోరుతో చతికిల పడింది.

విజయ్ కాంత్ భౌతికకాయాన్ని సందర్శించిన దళపతి..

విజయ్ పై చెప్పు విసిరిన వ్యక్తి

సినీ ఇండస్ట్రీలో తీవ్ర విషాదాన్ని నింపి తిరిగిరాని లోకాలకు వెళ్లారు కెప్టెన్ విజయ్ కాంత్. అనారోగ్యం కారణంగా గతకొంతకాలంగా ఇబ్బందిపడుతున్న విజయ్ కాంత్ నిన్న కన్నుమూశారు.కెప్టెన్ విజయ్‌కాంత్ అంత్యక్రియలు ఈ సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నారు. ఆయన పార్టీ అయిన %ణవీణఖ% ఆఫీస్ ముందే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. కానీ మెరీనా బీచ్‌లో %వీ+=%, జయలలిత మెమోరియల్ పక్కనే స్థలం ఇవ్వాలని విజయకాంత్ అభిమానులు, ఆయన పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే విజయ్ కాంత్ భౌతకకాయన్ని దర్శించుకున్నారు దళపతి విజయ్.

విజయ్ కాంత్ భౌతికకాయాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు విజయ్ కాంత్. దళపతి విజయ్ రావడంతో భారీగా అభిమానులు ఎగబడ్డారు. విజయ్ విజయకాంత్ పార్థివదేహాన్ని దర్శించుకొని నివాళులు అర్పించారు. అలాగే విజయ్ కాంత కుటుంబసభ్యులను పరామర్శించారు. విజయ్ ఎమోషనల్ అవుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.ఇదిలా ఉంటే విజయ్ కాంత్ భౌతికకాయాన్ని దర్శించుకోడానికి వచ్చిన దళపతి విజయ్ పై అభిమానులు ఎగబడ్డారు. విజయ్ ను చుట్టుముట్టి కదలకుండా చేశారు. సెక్యూరిటీ ఎంత ఆపినా అభిమానులు మాత్రం ఆగలేదు. విజయ్ ను చూసేందుకు ఆయనను

తాకెందుకు ఎగబడ్డారు. ఇంతలో ఎవరో విజయ్ పై చెప్పు విసిరారు. అయితే అది విజయ్ కు తగల్లేదు. కొద్దిలో మిస్ అయ్యింది. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో పై మీరూ ఓ లుక్కేయండి.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన లయన్స్ క్లబ్ నిర్వాహకులు

అభ్యుదయం. శేరిలింగంపల్లి. డిసెంబర్ 30. మదినగూడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని హైదరాబాద్ లయన్స్ క్లబ్ నిర్వాహకులు సుమారు 152 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జోనల్ చైర్ పర్సన్ ఎల్.ఎన్.కె రామ్మోహన్ , జిల్లా 1 వ వైస్ గవర్నర్ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎల్.ఎం. నాగూర్ రావు ,

కార్యదర్శి దుర్గాప్రసాద్ , వైస్ ప్రెసిడెంట్ ఎల్.ఎన్.ఎం రాజేంద్రన్ , ఎల్.ఎన్ ప్రభాకర్ రెడ్డి తో పాటు పాఠశాల హెడ్ మాస్టర్ ఎం.డి. యూసుఫ్ పాల్గొన్నారు.

ఐటీఆర్ ఫైల్ చేయని వారికి ఇదే ఆఖరి ఛాన్స్!

గత ఆర్థిక సంవత్సరానికి ఐటీఆర్ ఫైల్ చేయని వారికి ఇదే ఆఖరు ఛాన్స్. 2022-23కు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను రిటర్నులు ఫైల్ చేయడానికి వాస్తవానికి గడువు జులై 31తోనే ముగిసింది. అయితే, ఇప్పటికీ రిటర్నులు ఫైల్ చేయని వారు చాలా మందే ఉన్నారు. వారు డిసెంబర్ 31లోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది.గత ఆర్థిక సంవత్సరానికి గానూ ఐటీఆర్ ఫైల్ చేయని వారు 'బిలేటెడ్ ఐటీఆర్' ఫైల్ చేసే అవకాశం ఉంటుంది. దీనికి ఆఖరు తేదీ 2023, డిసెంబర్ 31. అంతేకాదు ఇప్పటికే ఐటీఆర్ ఫైల్ చేసిన వారు అందులో ఏవైనా తప్పులుంటే ఈ తేదీలోపు తిరిగి రివైజ్డ్ రిటర్న్ ఫైల్ చేసి సరిదిద్దుకోవచ్చు. తప్పులు సరిదిద్దుకోకపోతే భవిష్యత్‌లో నోటీసులు అందుకునే అవకాశం ఉంటుంది. రివైజ్డ్ రిటర్నులు దాఖలు చేసేందుకు ఎలాంటి ఆలస్య రుసుమూ

చెల్లించాల్సిన అవసరం లేదు.

2023కు నష్టాలతో వీడ్కోలు..

నిఫ్టీ ఏ 21,730

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు 2023కు నష్టాలతో వీడ్కోలు పలికాయి. చివరి ట్రేడింగ్ సెషన్‌ను ఉదయమే ప్రతికూలంగా ప్రారంభించిన మార్కెట్లు రోజంతా అదే బాటలో పయనించాయి.

గతకొన్ని రోజుల ర్యాలీ నేపథ్యంలో మదుపర్లు కీలక స్టాక్స్‌లో లాభాలను స్వీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు కూడా సూచీలపై ప్రభావం చూపాయి.

ఉదయం సెన్సెక్స్ 72,351.59 దగ్గర నష్టాలతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 72,082.64 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 170.12 పాయింట్ల నష్టంతో 72,240.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 21,737.65 వద్ద ప్రారంభమై ఇంట్రాడేలో 21,676.90 దగ్గర కనిష్ఠాన్ని తాకింది. చివరకు 43.20 పాయింట్లు కుంగి 21,735.50 వద్ద నిలిచింది. మార్కెట్లు ముగిసే సమయానికి డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.21 దగ్గర నిలిచింది.

సెన్సెక్స్-30 సూచీలో టాటా మోటార్స్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, విప్రో, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ,

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, టైటన్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్, రిలయన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు అత్యధికంగా నష్టపోయిన షేర్ల జాబితాలో ఉన్నాయి.

కంపెనీ మారుతావా.. కట్టు రూ. 25 కోట్లు!

కంపెనీ మారిన మాజీ సీఎఫ్‌వో జతిన్ దలాల్‌కు భారతీయ ఐటీ దిగ్గజం విప్రోఝలక్ ఇచ్చింది. ఒప్పందాన్ని ఉల్లంఘించి ప్రత్యర్థి కంపెనీలో చేరినందుకు గాను రూ. 25 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరింది. అంతే కాకుండా వడ్డీ కూడా కట్టాలని కోర్టులో దావా వేసింది.

కాగ్నిజెంట్ (%జశీస్త్రఅఅఓఖత్%) లో చేరిన తమ మాజీ సీఎఫ్‌వో జతిన్ దలాల్‌పై ఐటీ కంపెనీ విప్రో బెంగళూరులోని సివిల్ కోర్టులో ఇటీవల దావా వేసింది. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు గాను రూ. 25 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరినట్లు తమకు లభించిన కోర్టు పత్రాలను ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. ఈ నష్టపరిహారంపై సెప్టెంబర్ 29 నుంచి చెల్లింపు తేదీ వరకు 18 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లించాలని దలాల్‌ను కోరింది.

అంతేకాకుండా దలాల్ తమకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బహిర్గతం చేయకుండా, తమ కస్టమర్‌లు లేదా ఉద్యోగులను ఏ విధంగానూ ప్రభావితం చేయకుండా జతిన్ దలాల్‌పై విప్రో శాశ్వత నిషేధం విధించింది. అయితే ఈ విషయాన్ని మధ్యవర్తిత్వానికి రిఫర్ చేయాలని కోర్టును కోరుతూ దలాల్ దరఖాస్తు చేసుకున్నారు. తదుపరి విచారణ జనవరి 3న జరగనుంది. ఈ విషయాన్ని మధ్యవర్తిత్వానికి సూచించాలా వద్దా అనే దానిపై కోర్టు ఉత్తర్వులు జారీ చేస్తుంది.

మధ్యవర్తిత్వం అనేది కోర్టులతో పని లేకుండా వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఉద్దేశించిన ప్రత్యామ్నాయ మార్గం. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్‌లో దీనికి అవకాశం ఉంటే ఈ పద్ధతిని ఉపయోగించుకోవచ్చు.

జతిన్ దలాల్ డిసెంబర్ 1న కాగ్నిజెంట్‌లో సీఎఫ్‌వోగా చేరారు. ఈ కేసులో మొదటి విచారణ నవంబర్ 28న జరిగింది. డిసెంబరు ప్రారంభంలో దలాల్ ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ యాక్ట్ 1996లోని సెక్షన్ 8 కింద మధ్యవర్తిత్వానికి దరఖాస్తు చేశారు. ఈ సెక్షన్ ప్రకారం.. ఇరుపక్షాలను మధ్యవర్తిత్వానికి సూచించే అధికారం కోర్టులకు లభిస్తుంది.
జతిన్ దలాల్‌కు విప్రోలో రెండు దశాబ్దాల అనుభవం ఉంది. 2015 నుంచి ఆయన ఇక్కడ సీఎఫ్‌వోగా పనిచేశారు. 2019 నుంచి ప్రెసిడెంట్‌గా అదనపు బాధ్యతలను సైతం నిర్వహించారు. కాగ్నిజెంట్‌లో ఆయన వీసా ఫార్మాలిటీలు పూర్తయిన తర్వాత యూఎస్ లేదా యూకే వెళ్తారని తెలుస్తోంది.

ఇండియా అంటే చాలు... చెలరేగిపోతారు

కొంతమంది క్రికెటర్లకు కొన్ని జట్లపై ఆడడం అంటే మహా ఇష్టం. ఒకప్పుడు సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ ఆస్ట్రేలియాపై ఆడటాన్ని ఆస్వాదించేవాళ్లు. సహచరులంతా విఫలమైనా ఎన్నో మరుపురాని ఇన్నింగ్స్‌లు ఆడారు.
దక్షిణాఫ్రికా బ్యాటర్ డీన్ ఎల్గర్ కూడా ఇదే కోవకు చెందుతాడు. భారత్ అంటే చాలు అతడు భలే ఆడేస్తాడు. గత దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్‌ఇండియా జోరును అడ్డుకున్న అతడు.. ఇప్పుడు కూడా సుదీర్ఘ ఇన్నింగ్స్‌తో అదరగొట్టి దక్షిణాఫ్రికా విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ సిరీస్‌తర్వాత రిటైర్ అయ్యే ఆలోచనలో ఉన్న ఎల్గర్.. తన చివరి సిరీస్‌ను చిరస్మణీయం చేసుకున్నాడు.
అప్పుడలా.. ఇప్పుడిలా
భారత్‌పై ఆడటమంటే ఎల్గర్ ఎంతగా ఇష్టపడతాడంటే అతడి టాప్-5 టెస్టు ఇన్నింగ్స్‌లను తీసుకుంటే వాటిలో మూడు టీమ్‌ఇండియాపైనే ఉన్నాయి. 2022లో కెప్టెన్ కూడా అయిన అతడు ముందుండి నడిపించాడు. తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడినా ఆ సిరీస్‌ను దక్షిణాఫ్రికా సమం చేయగలిగిందంటే అందుకు కారణం ఎల్గర్ అద్భుత బ్యాటింగే. రెండో టెస్టులో గెలవాలంటే 240 పరుగులు చేయాల్సి ఉండగా.. భారత బౌలర్ల జోరు మీదున్నా, ఎల్గర్ మాత్రం అలవోకగా ఆడేశాడు. చక్కటి ఫుట్‌వర్క్, డిఫెన్స్‌తో నాణ్యమైన భారత పేస్ బౌలర్లను అతడు దీటుగా ఎదుర్కొన్నాడు. 96 పరుగులతో అజేయంగా నిలిచి భారత్ విజయాన్ని అడ్డుకున్నాడు.
ఏడాది తర్వాత మళ్లీ ఎల్గర్ భారత్‌కు అడ్డుగా నిలిచాడు. ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోరుకు కట్టడి చేద్దామనుకున్న టీమ్‌ఇండియా ఆశలపై నీళ్లు చల్లుతూ భారీ శతకంతో అదరగొట్టాడు.
సొంతగడ్డపైనే కాదు భారత్‌లోనూ భారత్‌పై ఎల్గర్ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 2019లో విశాఖపట్నంలో జరిగిన టెస్టులో అతడు 160 పరుగులు చేశాడు. స్పిన్‌కు దాసోహమంటున్న పిచ్‌పై అశ్విన్, జడేజాలను ఎదుర్కొంటూ ఆడిన ఈ ఇన్నింగ్స్ ఎల్గర్ సత్తాకు నిదర్శనం.

నేను అవుటా? ఎలా?..

అంపైర్ నిర్ణయంపై మండిపడ్డ రిజ్వాన్.. వీడియో

ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో పాకిస్తాన్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ అవుటైన తీరు నెట్టింట చర్చకు దారితీసింది. ఈ అంశంపై క్రికెట్ అభిమానులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర విరుద్ధ కామెంట్లతో ట్రోలింగ్ చేస్తున్నారు.

బాక్సింగ్ డే టెస్టులో పాకిస్తాన్ ఆసీస్ చేతిలో ఓటమిపాలైన విషయం తెలిసిందే.

మెల్‌బోర్న్ వేదికగా మంగళవారం మొదలైన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న షాన్ మసూద్ బృందం.. ఆతిథ్య ఆసీస్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులకు ఆలౌట్ చేసింది. అయితే, కంగారూ బౌలర్ల ధాటికి తాళలేక 264 పరుగులకే తమ మొదటి ఇన్నింగ్స్‌ను ముగించింది.

ఈ క్రమంలో 54 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆసీస్.. మరో 262 పరుగులు జతచేసి ఆలౌట్ అయింది. దీంతో పాక్ విజయ లక్ష్యం 317గా మారింది. అయితే, టార్గెట్ ఛేదనకై బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు ఆదిలోనే షాకిచ్చారు ఆసీస్ పేసర్లు. ఓపెనర్లు.. అబ్దుల్లా షఫీక్‌ను 4 పరుగుల వద్ద స్టార్క్ పెవిలియన్‌కు పంపగా.. 12 పరుగులతో ఆడుతున్న ఇమామ్ ఉల్ హక్‌ను కమిన్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ క్రమంలో వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ షాన్ మసూద్ 60 పరుగులు చేసి అవుట్ కాగా.. బాబర్ ఆజం 41, సౌద్ షకీల్ 24 పరుగులతో పర్వాలేదనిపించారు.

రిజ్వాన్‌పై ఆశలు పెట్టుకున్న పాకిస్తాన్ ఈ క్రమంలో వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్‌పై ఆశలు పెట్టుకున్న పాకిస్తాన్‌ను ఆసీస్ సారథి ప్యాట్ కమిన్స్ మరోసారి దెబ్బకొట్టాడు. పాక్ రెండో ఇన్నింగ్స్ సందర్భంగా 61వ ఓవర్ వేసిన కమిన్స్ బౌలింగ్‌లో బంతి రిజ్వాన్ రిస్ట్‌బ్యాండ్‌ను తాకి కీపర్ చేతుల్లో పడినట్లు కనిపించింది.
రివ్యూకు వెళ్లిన కమిన్స్ దీంతో కమిన్స్ గట్టిగా అప్పీలు చేయగా.. ఆన్ ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. అయితే, కమిన్స్ మాత్రం అంపైర్ నిర్ణయాన్ని చాలెంజ్ తీస్తూ డీఆర్ఎస్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో థర్డ్ అంపైర్.. నిశితంగా పరిశీలించిన తర్వాత.. ఆన్ ఫీల్డ్ అంపైర్ నిర్ణయాన్ని తారుమారు చేసి.. రిజ్వాన్‌ను అవుట్‌గా ప్రకటించాడు.

దీంతో ఆసీస్ శిబిరంలో సంబరాలు మొదలుకాగా.. రిజ్వాన్ తనకు అన్యాయం జరిగిందన్నట్లుగా మైదానంలోనే తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అంపైర్ వద్దకు దూసుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రిజ్వాన్ అవుటా? నాటౌటా? అంటూ చర్చలు
ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంపైర్‌ను ఒత్తిడిలోకి నెట్టి తమకు అనుకూలంగా ఫలితం వచ్చేలా చేశారని.. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద రిజ్వాన్‌ను నాటౌట్‌గా ప్రకటించాల్సిందని పాక్ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరేమో.. బంతి బ్యాటర్ గ్లోవ్స్‌ను తాకి కీపర్ చేతుల్లో పడితే నిబంధనల ప్రకారం అవుట్ ఇవ్వడం సరైందేనని.. ఇక్కడ రిస్ట్‌బ్యాండ్ కూడా గ్లోవ్‌ను అంటి ఉందనే విషయాన్ని గమనించాలని హితవు పలుకుతున్నారు. కాగా రిజ్వాన్(35 పరుగులు) రూపంలో కమిన్స్ 250వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

కాగా ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ 79 పరుగుల తేడాతో ఓడిపోయి సిరీస్‌ను మరోసారి ఆతిథ్య ఆసీస్‌కు సమర్పించుకుంది. ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో టెస్టు బుధవారం నుంచి మొదలుకానుంది.

సౌతాఫ్రికాతో రెండో టెస్ట్..

టీమిండియాలోకి యువ పేసర్

జనవరి 3 నుంచి సౌతాఫ్రికాతో జరుగనున్న రెండో టెస్ట్ కోసం టీమిండియా ఓ మార్పు చేసింది. టెస్ట్ సిరీస్ కోసం తొలుత ఎంపిక చేయబడిన మొహమ్మద్ షమీ.. ఫిటెనెస్ క్లియెరెన్స్ లభించని కారణంగా సిరీస్ మొత్తానికే దూరం కాగా..27 ఏళ్ల మధ్యప్రదేశ్ పేసర్ ఆవేశ్ ఖాన్ షమీ స్థానంలో రెండో టెస్ట్ కోసం టీమిండియాలోకి వచ్చాడు. ఈ విషయాన్ని భారత సెలెక్టర్లు ఇవాళ (డిసెంబర్ 29) అధికారికంగా ప్రకటించారు.ఆవేశ్ ఖాన్ ఇటీవల సౌతాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 6 వికెట్లతో రాణించిన కారణంగా రెండో టెస్ట్ కోసం అతన్ని ఎంపిక చేసినట్లు సెలెక్టర్లు చెప్పారు. ఆవేశ్ ఖాన్ భారత టెస్ట్ జట్టుకు ఎంపిక కావడం ఇదే తొలిసారి. గతేడాది పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో అరంగేట్రం చేసిన ఆవేశ్.. టీమిండియా తరపున ఇప్పటివరకు 8 వన్డేలు, 19 టీ20లు ఆడి ఓవరాల్‌గా 27 వికెట్లు పడగొట్టాడు.కాగా, సెంచూరియన్ వేదికగా సౌతాఫ్రికాతో ఇటీవల ముగిసిన తొలి టెస్ట్‌లో టీమిండియా ఇన్నింగ్స్ 32 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమిండియా అన్ని విభాగాల్లో దారుణంగా విఫలమై, ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది.

దేవర నుంచి క్రేజీ అప్డేట్ అప్డేట్. . ఆ విషయంలో ట్రిపులార్ సక్సెస్ ఫార్ములా ఇంప్లిమెంట్..

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ దేవర. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఏప్రిల్‌లో ఆడియన్స్ ముందుకు రానుంది.అయితే ఈ ప్రమోషన్స్ విషయంలో స్పెషల్ కేర్ తీసుకుంటున్న మేకర్స్. ఆల్రెడీ సక్సెస్ అయిన ఓ ఫార్ములాను రీ ఇంప్టిమెంట్ చేసే ప్లాన్‌లో ఉంది. ట్రిపులార్ తరువాత లాంగ్ బ్రేక్ తీసుకున్న తారక్ ప్రస్తుతం దేవర వర్క్‌లో బిజీగా ఉన్నారు.

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ దేవర. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఏప్రిల్‌లో ఆడియన్స్ ముందుకు రానుంది. అయితే ఈ ప్రమోషన్స్ విషయంలో స్పెషల్ కేర్ తీసుకుంటున్న మేకర్స్. ఆల్రెడీ సక్సెస్ అయిన ఓ ఫార్ములాను రీ ఇంప్టిమెంట్ చేసే ప్లాన్‌లో ఉంది.ట్రిపులార్ తరువాత లాంగ్ బ్రేక్ తీసుకున్న తారక్ ప్రస్తుతం దేవర వర్క్‌లో బిజీగా ఉన్నారు. ఆల్రెడీ రిలీజ్ డేట్ కూడా లాక్ అవ్వటంతో వీలైనంత త్వరగా ను ఫినిష్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రజెంట్ న్యూ ఇయర్ వెకేషన్‌కు వెళ్లిన జూనియర్, తిరిగి వచ్చిన వెంటనే షూటింగ్ రీస్టార్ట్ చేస్తారు.

షూటింగ్ విషయంలోనే కాదు రిలీజ్ విషయంలో కూడా ఇప్పటి నుంచే పక్కా ప్లాన్ రెడీ చేస్తోంది దేవర టీమ్. సంక్రాంతి కానుకగా టీజర్ రిలీజ్ చేయాలని ఫిక్స్ అయిన మేకర్స్, అప్పటి నుంచి వరుస అప్‌డేట్స్ ఇవ్వాలనుకుంటున్నారు. అంతేకాదు ట్రిపులార్ విషయంలో సక్సెస్ అయిన ఓ ఫార్ములాను దేవర విషయంలోనూ ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారు.
ట్రిపులార్ ప్రమోషన్స్‌లో అందరికన్నా ఎక్కువ హైలెట్ అయ్యింది తారకే. వెళ్లిన ప్రతీ స్టేట్‌లోనూ అక్కడి లోకల్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతూ ఆడియన్స్‌కు దగ్గరయ్యారు జూనియర్. ఆ ఇమేజ్‌ను దేవర విషయంలో కూడా క్యాష్ చేసుకోవాలనుకుంటోంది యూనిట్.
తారక్ సోలో హీరోగా చేస్తున్న తొలి పాన్ ఇండియా మూవీ కావటంతో ప్రమోషన్ యాక్టివిటీస్ అన్నీ తారక్ సెంట్రిక్‌గానే ప్లాన్ చేస్తున్నారు. అందుకే జనవరి నుంచే ప్రమోషన్స్ స్టార్ట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. మరి ఈ ప్లానింగ్ ఎంత వరకు వర్క్ అవుట్ అవుతుందో చూడాలి.

ఏప్రిల్ 1న కల్కి ట్రైలర్ విడుదల

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం కల్కి 2898 ఏడీ మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని 2024లో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. రిలీజ్ డేట్‌పై రానున్నరోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది నాగ్ అశ్విన్ టీం. కాగా
ఐఐటీ బాంబే 23 కాన్వొకేషన్ హాల్‌లో నాగ్ అశ్విన్ చిట్ చాట్‌లో పాల్గొన్నాడు. ఈ సెషన్‌లో పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చాడు. ఈవెంట్‌లో ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కల్కి ట్రైలర్ వచ్చేది ఎప్పుడో క్లారిటీ ఇచ్చేశాడు. ఈ మూవీ ట్రైలర్‌ను 2024 ఏప్రిల్ 1న విడుదల చేయనున్నట్టు
చెప్పాడు. అంటే ఇవాళ్టి నుంచి 93 రోజులన్నమాట. ఇంకేంటి మరి మరో మూడు నెలలు ఆగితే ట్రైలర్ రాబోతుందన్నమాట. కల్కి 2898 ఏడీలో బాలీవుడ్ స్టార్ యాక్టర్లు దీపికా పదుకొనే , దిశా పటానీ, అమితాబ్ బచ్చన్, లజెండరీ యాక్టర్ కమల్ హాసన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మేకర్స్ లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ రైడర్స్ (యూనిఫార్మ్‌డ్ విలన్ ఆర్మీ) కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో క్యూరియాసిటీని అమాంతం పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ సుమారు 500 కోట్లకుపైగా బ్జడెట్‌తో తెరకెక్కిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్, గ్లింప్స్ వీడియో నెట్టింట వ్యూస్ పంట పండిస్తున్నాయి. ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ సీఈవో టెడ్‌సారండోస్ హీరో ప్రభాస్ అండ్ టీంతో కలిసి దిగిన సెల్ఫీని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. . కల్కి 2898 ఏడీ హాలీవుడ్ సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా హై టెక్నికల్ వాల్యూస్‌తో విజువల్స్ చెబుతున్నాయి.

సెన్సార్ పూర్తి చేసుకున్న హనుమాన్

టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'హనుమాన్' . భారతీయ ఇతిహాసాల్లోని

హనుమంతుని కథ స్ఫూర్తితో ఈ సినిమా రానుంది. ఇందులో జాంబి రెడ్డి కథానాయకుడు తేజ సజ్జా హీరోగా నటిస్తున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సూపర్ హీరో సిరీస్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో అందరినీ ఇంప్రెస్ చేస్తున్నాయి. ఇదిలావుంటే.. తాజాగా ఈ మూవీ నుంచి సెన్సార్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్.హనుమాన్ చిత్రం తాజాగా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యూ సర్టిఫికేట్ ఇచ్చింది.

ఇక ఈ సినిమా నిడివి 2 గంటల 30 నిమిషాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా చూడటానికి 1.5 లక్షలకు పైగా అభిమానులు ఆసక్తికరంగా ఉన్నట్లు బుక్ మై షోలో వెల్లడించారు.

నేడు మరోమారు తెరపైకి వెంకీ మూవీ

రవితేజ హీరోగా నటించిన 'వెంకీ' ప్రేక్షకుల్ని ఎంతగా అలరించిందో తెలిసిందే! 2004లో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయనుంది. శ్రీనువైట్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాటలు, డైలాగ్‌లు, బ్యాగ్రౌండ్ స్కోర్ ఇప్పటికీ ఎక్కడో ఓ చోట వింటూనే ఉంటాం. అంతగా పాపులర్ అయిన చిత్రమిది. ఇప్పుడీ కామెడీ థ్రిల్లర్ ఈ నెల 30న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీను వైట్ల ఓ వీడియో పోస్ట్ చేశారు. 'వెంకీ నాకెంతో ఇష్టమైన సినిమా. నా కెరీర్‌కు ప్రత్యేకమైనది కూడా. 2004లో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించిన ఈ చిత్రం రీ రిలీజ్ కావడం సంతోషంగా ఉంది. ఆ సినిమా ఎప్పుడు గుర్తొచ్చినా నవ్వొస్తుంటుంది. దాని షూటింగ్ అంతా ఎంతో సరదాగా సాగింది. రవితేజ వల్లే సినిమా అంత బాగా వచ్చింది. ఆయన నాపై నమ్మకంతో సినిమా ఓకే చేశారు. యువత ఎదుర్కొనే

సవాళ్లు.. వారి భావోద్వేగాలతో తెరకెక్కిన 'వెంకీ' ఎవర్‌గ్రీన్ సినిమా.. అందులో బ్రహ్మానందం, ఎవీఎస్ పోషించిన పాత్రలకు ఎంతో ఆదరణ లభించింది. 2004లో వచ్చిన ఈ చిత్రం రీ రిలీజ్ టికెట్స్ బుకింగ్స్ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. అందరికీ కృతజ్ఞతలు' అని వీడియోలో పేర్కొన్నారు. ప్రస్తుతం రవితేజ 'ఈగల్' చిత్రంలో నటిస్తున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదల కానుంది. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ కథానాయికలు.

హన్సిక..105 మినిట్స్

బబ్లీ బ్యూటీ హన్సిక ప్రధాన పాత్రలో స్కిన్ మాఫియా కథాంశంతో వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ 'మై నేమ్ ఈజ్ శృతి'. ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి.. మంచి విజయాన్నే అందుకుంది. ఆ సినిమా సక్సెస్ తర్వాత మళ్లీ మరో వైవిధ్యభరిత సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు హన్సిక రెడీ అవుతోంది. ఆమె హీరోయిన్‌గా రాజు దుస్స దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా '105 మినిట్స్' . తాజాగా ఈ మూవీ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రుద్రాంశ్ సెల్యులాయిడ్స్, మాంక్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ చిత్రానికి బొమ్మ కె శివ నిర్మాత. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా సింగిల్ షాట్ సింగిల్ క్యారెక్టర్ మూవీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మోషన్ పోస్టర్‌లో రక్తపు గాయాలతో కుర్చీలో కూర్చున్న హన్సిక ఒక ఇంటెన్సి÷డ్ లుక్‌తో కనిపిస్తోంది. ఈ మోషన్ పోస్టర్‌ను 'మంగళవారం' డైరెక్టర్ అజయ్ భూపతి చేతుల మీదగా చిత్రయూనిట్ విడుదల చేసింది. శ్యాం సియస్ సంగీతాన్ని అందించారు. ఈ మోషన్ పోస్టర్ మూవీపై భారీగా అంచనాలను పెంచేస్తోంది. హన్సిక ఇంతకుముందు ఎన్నడు కనిపించని గెటప్‌లో చాలా కొత్తగా కనిపిస్తోంది. హీరోయిన్ ఓరియంటెడ్ రోల్.. అందులోనూ ఇలాంటి ఒక డిఫరెంట్ రోల్ చేయడం
హన్సికకి ఇదే మొదటిసారి. మాంక్ మరియు పనోరమ

స్టూడియోస్ సంయుక్తంగా డిస్టిబ్యూట్ చేస్తున్న ఈ సినిమా జనవరి 26న రిపబ్లిక్ డే స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

Address 8-3-231/A/71,72, Flat No 301, 3rd floor, Varalaxmi Appts, Sri Krishna Nagar, Yousufguda, Hyderabad - 5000045Email. marpu247@gmail.compH:86391 88826